# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 10 సంచిక :192 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేదీ: మంగళవారం 07-10-2025 | పేజీలు:4 వెల: 2.00


## ఇన్‌స్టాలో పరిచయం.. ఫామ్‌హౌస్‌లో మైనర్ల ట్రాప్ హౌస్ పార్టీ

హైదరాబాద్: వారంతా మైనర్లే.. ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమయ్యారు. అంతా కలిసి ఓ ఫామ్‌హౌస్‌లో విదేశీ మద్యం, గంజా కొడుతూ జోరుగా పార్టీ చేసుకున్నారు. అంతా మత్తులో ఉండగా ఎస్‌వోటీ పోలీసులు రంగప్రవేశం చేశారు. నిర్వాహకులతో సహా అందరనీ అదుపులోకి తీసుకున్న ఘటన రంగారెడ్డి జిల్లా మొయినాబాద్‌లో చోటుచేసుకున్నది. హైదరాబాద్‌కు చెందిన ఓ డీజే ఇన్‌స్టా యాప్‌లో 'ట్రాప్ హౌస్.9ఎంఎం' పేరుతో ఖాతా నిర్వహిస్తున్నాడు. మొయినాబాద్‌లోని చెర్రీ ఫామ్‌హౌస్‌లో ట్రాప్ హౌస్ పార్టీ నిర్వహిస్తున్నట్టు ప్రచారం చేశాడు. శనివారం మధ్యాహ్నం 2 నుంచి రాత్రి 10 గంటల వరకు పార్టీ జరుగుతుందని, పాల్గొనాలంటే ఎంట్రీ పాస్‌లు తీసుకోవాలని.. ఒక్కరికైతే రూ.1,600, అదే జంటగా వస్తే రూ.2,800 అని పేర్కొన్నాడు. ఇది చూసిన వివిధ ప్రాంతాలకు చెందిన 50 మంది మైనర్లు.. శనివారం మొయినాబాద్‌లోని ఫామ్‌హౌస్‌కు చేరుకున్నారు. అయితే వేడుకలో డ్రగ్స్ వాడుతున్నట్లు సమాచారం అందడంతో రాజేంద్రనగర్ ఎస్‌వోటీ పోలీసులు దాడులు నిర్వహించారు. 6 విదేశీ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. డ్రగ్ పరీక్షలో ఇద్దరు మైనర్లు గంజాయి తీసుకున్నట్టు తేలింది.

## దగ్గు సిరప్‌తో జాగ్రత్త.. మార్గదర్శకాలు విడుదల చేసిన ఆరోగ్యశాఖ



హైదరాబాద్: దగ్గు సిరప్ కారణంగా చిన్నారులు మృత్యువాత పడుతున్నారు. కోల్డ్రిఫ్ దగ్గు మందును వాడటంతో మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లలో సుమారు 14 మంది మరణించారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ అప్రమత్తమయింది. రెండేండ్లలోపు చిన్నారులకు దగ్గు, సర్ది సిరప్‌లు ఇవ్వొద్దని సూచించింది. ఈ మేరకు దగ్గు సిరప్ విషయంలో జాగ్రత్తలు పాటించాలని మార్గదర్శకాలు విడుదల చేసింది. సర్ది, దగ్గు తాత్కాలిమేనని, ఎక్కువ శాతం కేసులు స్వయంగానే తగ్గుతాయని జిల్లా వైద్యాధికారులకు హెల్త్ డైరెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ప్రైవేట్, ప్రభుత్వ దవాఖానలన్నిటికీ ఆదేశాలు చేరవేయాలని సూచించారు. దగ్గు తగ్గించేందుకు మొదట హోమ్ కేర్, పానీయాలు, విశ్రాంతి అవసరమని తెలిపారు. జీఎంపీ ప్రమాణాలతో తయారైన సిరప్‌లను మాత్రమే వాడాలని స్పష్టం చేశారు. అడల్టరేషన్ ఉన్న కోల్డ్రిఫ్ సిరప్ వాడొద్దని సూచించారు. బ్యాచ్ నంబర్ ఎస్ఆర్-13, మే 2025 తయారీ, ఏప్రిల్ 2027 గడువు ఉన్న సిరప్ రీకాల్ చేయాలని ఆదేశించారు. ఈ సిరప్‌లో ప్రమాదకరమైన డైఇథిలీన్ గ్లైకాల్ కలుషితం ఉన్నట్లు అనుమానం వ్యక్తమవుతున్నదని పేర్కొన్నారు. సిరప్ ఉన్నవారు వెంటనే స్థానిక డ్రగ్ కంట్రోల్ అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ప్రజల్లో అవగాహన కల్పించాలని అన్ని జిల్లా వైద్యాధికారులకు ఆదేశించారు. మరింత సమాచారం కోసం 1800-599-6969 టోల్ ఫ్రీ నంబర్ ఏర్పాటు చేశారు.

## బీసీ రిజర్వేషన్లపై పిటిషన్‌ను కొట్టివేసిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: బీసీ రిజర్వేషన్లపై సుప్రీం కోర్టులో రాష్ట్ర ప్రభుత్వానికి ఊరట లభించింది. రిజర్వేషన్లకు వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్లను సర్వోన్నత న్యాయస్థానం కొట్టివేసింది. హైకోర్టులో పెండింగ్‌లో ఉండటంతో విచారణకు స్వీకరించలేమని జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన ధర్మాసనం పిటిషన్‌ను తిరస్కరించింది. తెలంగాణ స్థానిక ఎన్నికల్లో బీసీలకు రిజర్వేషన్ల పెంపుపై వంగా గోపాల్‌రెడ్డి అనే వ్యక్తి సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. దీనిపై విచారణ జరిపిన ద్విసభ్య ధర్మాసనం.. హైకోర్టులో విచారణలో ఉండగా ఇక్కడకు ఎందుకు వచ్చారని పిటిషనర్ తరపు లాయర్‌ను ప్రశ్నించింది. దీంతో తెలంగాణ హైకోర్టు స్టే ఇవ్వడానికి నిరాకరించిందని ఆయన బదులిచ్చారు. దీంతో అక్కడ స్టే ఇవ్వడానికి నిరాకరిస్తే ఇక్కడకు వస్తారా అని ప్రశ్నించింది. ఈ నేపథ్యంలో హైకోర్టులో పెండింగ్ ఉన్నందున విచారణకు స్వీకరించలేమని పిటిషన్‌ను కొట్టివేసింది. రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం సెప్టెంబర్ 26న జీవో నంబర్ 9 జారీ చేసి, స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ప్రకటించింది. దీనిని సామాజిక న్యాయంగా వర్ణించింది. ఈ జీవో ఆధారంగా రిజర్వేషన్ల గెజిట్లను పంచాయతీరాజ్‌శాఖ విడుదల చేసింది. ఆ మేరకు తెలంగాణలో స్థానిక సంస్థల (గ్రామ పంచాయతీలు, మండల ప్రజా పరిషత్‌లు, జిల్లా పరిషత్‌లు) ఎన్నికల షెడ్యూల్‌ను రాష్ట్ర ఎన్నికల కమిషన్ ప్రకటించింది. జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు రెండు దఫాల్లో, పంచాయతీ ఎన్నికలు మూడు దఫాల్లో మొత్తం ఐదు దశల్లో అక్టోబర్ 9 నుంచి నవంబర్ 11 వరకు ఎన్నికల ప్రక్రియ పూర్తికానున్నది. అయితే, స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ ప్రభుత్వం జారీచేసిన జీవోను సవాల్‌చేస్తూ మాధవరెడ్డి హైకోర్టు పిటిషన్ వేశారు. గత రిజర్వేషన్లు రద్దుచేయకుండా కొత్త రిజర్వేషన్లు కల్పిస్తున్నారని పిటిషనర్ పేర్కొన్నారు. విచారణ జరిపిన హైకోర్టు



ధర్మాసనం, విచారణను 8వ తేదీకి వాయిదా వేయింది. ఇదిలా ఉండగానే సుప్రీంకోర్టులో వంగా గోపాల్‌రెడ్డి అనే వ్యక్తి మరో పిటిషన్ వేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో మొత్తం రిజర్వేషన్లు 50 శాతం దాటుతున్నాయని గోపాల్ రెడ్డి తన పిటిషన్‌లో తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, దివ్యాంగులు, ఇతర రిజర్వేషన్లు అన్నీ కలిపి కూడా 50 శాతం రిజర్వేషన్ దాటవద్దని గతంలో సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందని ప్రస్తావించారు. సుప్రీంకోర్టు ఇచ్చిన సీలింగ్‌ను ఎత్తివేస్తూ బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించడం చట్టవిరుద్ధమని పేర్కొన్నారు. ఎస్సీలకు 15 శాతం రిజర్వేషన్, ఎస్టీలకు 10 శాతం, బీసీలకు ఇచ్చే రిజర్వేషన్ 42 శాతంతో కలుపుకుంటే మొత్తం రిజర్వేషన్లు 67 శాతం అవుతున్నదని తెలిపారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించే జీవో 9ను తక్షణమే రద్దుచేయాలని కోరారు. ఈ పిటిషన్‌లో మాధవరెడ్డి, తీన్మార్ మల్లన్న ఇద్దరు కూడా ఇంప్లీడ్ అయ్యారు. దీనిపై విచారణ జరిపిన సుప్రీంకోర్టు ద్విసభ్య ధర్మాసనం పిటిషన్‌ను కొట్టివేసింది.

## అలా చేయకపోతే భారీ రక్తపాతమే.. ఇజ్రాయెల్, హమాస్‌కు ట్రంప్ కీలక హెచ్చరికలు

గాజా విషయంలోఇజ్రాయెల్ , హమాస్ కు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. గాజా శాంతి ప్రణాళిక విషయంలో వెంటనే ఒక నిర్ణయానికి రాకపోతే భారీ రక్తపాతం చూడాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈజిప్టు వేదికగా ఇరు పక్షాల మధ్య కీలక చర్చలు జరగనున్న నేపథ్యంలో ట్రంప్ ఈ హెచ్చరికలు చేశారు.

'శతాబ్దాల నాటి ఈ సంఘర్షణను నేను నిశితంగా గమనిస్తున్నానే ఉన్నాను. సమయం చాలా విలువైంది. గాజా శాంతి ప్రణాళికపై ఇజ్రాయెల్, హమాస్ త్వరగా ముందుకు సాగాలి. అలా చేయడంలో విఫలమైతే భారీ రక్తపాతం జరుగుతుంది ' అంటూ ట్రూత్‌లో పోస్టు పెట్టారు. హమాస్‌తో పాటు ఇతర అరబ్, ముస్లిం దేశాలతో జరిపిన చర్చలు సఫలమయ్యాయని, బందీల విడుదల, గాజాలో యుద్ధం ముగింపు వంటి అంశాలపై సానుకూల వాతావరణం నెలకొందని ఈ సందర్భంగా ట్రంప్ తెలిపారు. నేడు ఈజిప్టు వేదికగా తుది చర్చలు జరగనున్నట్లు వెల్లడించారు. అంతకుముందు తొలి దశలో భాగంగా గాజాలోని బలగాల ఉపసంహరణకు ఇజ్రాయెల్ అంగీకరించినట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. ఇందుకు సంబంధించిన సమాచారాన్ని హమాస్‌కు కూడా పంపించినట్లు ఆయన తన సామాజిక మాధ్యమం ట్రూత్



సోషల్ వేదికగా శనివారం వెల్లడించారు. హమాస్ నుంచి ఆమోదం లభించిన వెంటనే గాజాలో కాల్పుల విరమణ అమలులోకి వస్తుందని, ఇజ్రాయెలీ బందీలు, పాలస్తీనా బందీల మార్పిడి ప్రారంభమవుతుందని ట్రంప్ తెలిపారు. తొలి దశ ఉపసంహరణకు పరిస్థితులను సానుకూలం చేస్తామని, దీంతో 3,000 సంవత్సరాల పాలస్తీనా సంక్షోభానికి ముగింపు లభించగలదని ట్రంప్ ఆశాభావం వ్యక్తం చేశారు.

## ఏపీకి ప్రధాని మోదీ.. మరో ప్రతిష్టాత్మక ప్రాజెక్టు!



అమరావతి,ఆంధ్రప్రదేశ్ కు అత్యంత ప్రాధాన్యం ఇస్తోంది కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం. 2024 ఎన్నికల్లో గెలిచిన నాటి నుంచి ఏపీకి ప్రతిష్టాత్మక ప్రాజెక్టులు మంజూరు చేస్తూ వస్తోంది. ఒకవైపు అమరావతి రాజధాని నిర్మాణం, ఇంకోవైపు పోలవరం.. ఇలా అన్నింటికీ సహకారం అందిస్తూ వస్తోంది. విశాఖ జిల్లాలో కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల ఏర్పాటుకు ముందుకు వచ్చింది. అక్కడ లక్షల కోట్ల పెట్టుబడులు పెడుతోంది. తాజాగా రక్షణ రంగంలో కూడా కీలక అడుగులు పడుతూ ప్రతిష్టాత్మక ప్రాజెక్టుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దానకొండలో బీడీఎల్ రూ.1200 కోట్ల పెట్టుబడితో భారీ స్థాయిలో సమీకృత ఆయుధ వ్యవస్థ, ప్రొపెలెంట్ తయారీ యూనిట్ ఏర్పాటుకు నిర్ణయించింది. ప్రధాని నరేంద్ర మోడీ ఏపీ పర్యటనకు వస్తున్న క్రమంలోనే ఈ కీలక ప్రాజెక్టుకు గ్రీన్ సిగ్నల్ లభించడం విశేషం.

బీడీఎల్ ఆయుధ వ్యవస్థ..

ప్రధాని నరేంద్ర మోడీ ఈనెల 16న ఏపీలో పర్యటించనున్నారు. శ్రీశైలం ఆలయ సందర్శనతో పాటుగా జీఎస్టీ ర్యాలీలో ప్రధాని పాల్గొనున్నారు. ఇందుకు సంబంధించి షెడ్యూల్ కూడా ఖరారు చేశారు. సరిగ్గా ఇటువంటి సమయంలోనే కేంద్ర ప్రభుత్వం ఈ గుడ్ న్యూస్ చెప్పింది. ప్రకాశం జిల్లా దానకొండలో ప్రతిష్టాత్మక సంస్థ భారత్ డైనమిక్స్ లిమిటెడ్ సమీకృత ఆయుధవ్యవస్థను ఏర్పాటు చేయనుంది. 1200 కోట్ల రూపాయలతో ఈ ప్రాజెక్టు నిర్మాణం కానుంది. మొదటి దశలో రూ.650 కోట్లను, రెండో దశలో రూ.550 కోట్లను వెచ్చించనుంది. ప్రాజెక్టు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే రక్షణ పరికరాల తయారీలో దేశవ్యాప్తంగా రాష్ట్రం ప్రత్యేక గుర్తింపు పొందే అవకాశం ఉంది. ఈ ప్రాజెక్టు ద్వారా 600 మందికి ప్రత్యక్షంగా, వెయ్యి మందికి పరోక్షంగా ఉపాధి దక్కనుంది.

విజయనగరం జిల్లాలో ఆయుధ డిపో..

మరోవైపు నావికి సంబంధించి ఆయుధ డిపో ఏర్పాటు విజయనగరం జిల్లాలోజరగనుంది. బాడంగిలో ఈ ఆయుధం డిపో ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. బ్రిటీష్ హయాంలో బాడంగి మండలంలో ఒక చిన్న కార్గో విమానాశ్రయం ఉండేది. కాలక్రమంలో ఈ విమానాశ్రయం కనుమరుగయింది. అక్కడ భూములు రైతుల చేతుల్లోకి వెళ్లిపోయాయి. తూర్పు కోస్తా నౌక కేంద్రం విశాఖగా నడుస్తోంది. అదే సమయంలో భోగాపురం లో అంతర్జాతీయ విమానాశ్రయం ఏర్పాటు అవుతోంది. ఇటువంటి పరిస్థితుల్లో నావి ఆయుధం డిపోను బాడంగిలో ఏర్పాటు చేసేందుకు.. కేంద్ర నావికాదళం నిర్ణయించింది. రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించడంతో భూసేకరణకు యంత్రాంగం సిద్ధపడింది. అయితే రక్షణ రంగానికి సంబంధించి కీలక ప్రాజెక్టులు వస్తుండడం శుభపరిణామం.

## జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక: షార్ట్ లిస్టు అయిన నలుగురు వీరే



హైదరాబాద్,జూబ్లీహిల్స్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అకస్మిక మరణంతో జరగనున్న ఉప ఎన్నిక కోసం అధికార కాంగ్రెస్ నలుగురు ఆశావాహులను షార్ట్ లిస్టు చేసి అధిష్ఠానానికి పంపింది. ఇప్పటికే బీఆర్ఎస్ అభ్యర్థిగా మాగంటి గోపీనాథ్ సతీమణిని ఎంపిక చేయటం తెలిసిందే. ఇదిలా ఉంటే కాంగ్రెస్ నుంచి ఆశావాహుల జాబితా భారీగా మారింది. ఇలాంటి వేళలో తెలంగాణ కాంగ్రెస్ పార్టీ నలుగురు పేర్లను షార్ట్ లిస్టు తయారు చేసింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనలతో ఈ నాలుగు పేర్లను ఎంపిక చేయగా.. వీరిలో ఒకరిని అభ్యర్థిగా పేర్కొంటూ రెండు రోజుల వ్యవధిలో అధిష్ఠానం ప్రకటిస్తుందని చెబుతున్నారు. ఇంతకూ అధినాయకత్వానికి పంపుతున్న నాలుగు పేర్లు ఏవంటే.. నవీన్ యాదవ్.. మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్, మాజీ మేయరు బొంతు రామ్మోహన్, కార్పొరేటర్ సీఎన్ రెడ్డిలు. బీసీలకు రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతూ జీవో ఇచ్చిన వేళ.. జూబ్లీహిల్స్ టికెట్ ను కూడా బీసీ సామాజిక వర్గానికి చెందిన వారినే ఎంపిక చేయాలన్నది రాష్ట్ర కాంగ్రెస్ నేతల ఆలోచనగా చెబుతున్నారు. దీనికి తోడు గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో బలమైన బీసీ సామాజిక వర్గాలకు చెందిన ముగ్గురు బలమైన నేతలు తుది జాబితాలో చోటు దక్కించుకున్నారు. అయితే.. ఇందులో నవీన్ యాదవ్ కే టికెట్ దక్కేందుకు ఎక్కువ అవకాశాలు ఉన్నట్లుగా చెబుతున్నారు. 2014 అసెంబ్లీ ఎన్నికల్లో జూబ్లీహిల్స్ మజ్లిస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసిన నవీన్ యాదవ్ ఓటమిపాలయ్యారు. గతంలో ఇదే నియోజకవర్గం నుంచి పోటీ చేసిన నేపథ్యంలో.. స్థానిక ఓటర్లతో ఉన్న పరిచయాలు ఆయన వైపు అధిష్ఠానం మొగ్గేందుకు అవకాశం ఉందంటున్నారు. ఇదిలా ఉండగా.. అంజన్ కుమార్ యాదవ్ గతంలో సికింద్రాబాద్ ఎంపీగా పని చేసి ఉండటం.. దాని పరిధిలోకే జూబ్లీహిల్స్ నియోజకవర్గం వస్తున్న నేపథ్యంలో ఆయనకు కూడా పరిచయాలు ఎక్కువగానే ఉన్నాయని చెప్పాలి. ఇక.. బొంతు రామ్మోహన్ విషయానికి వస్తే.. ఆయన నగర మేయర్ గా సేవలు అందించటం.. అందరికి సుపరిచితుడన్నది తెలిసిందే. ఇక.. రహమత్ నగర్ నుంచి గత ఎన్నికల్లో బీఆర్ఎస్ కార్పొరేటర్ గా ఎన్నికైన సీఎన్ రెడ్డి ఇటీవల కాంగ్రెస్ లో చేరటం.. తాను ప్రాతినిధ్యం వహిస్తున్న డివిజన్ జూబ్లీహిల్స్ పరిధిలోనే ఉండటంతో తనకు టికెట్ కేటాయిస్తే ఫలితం పాజిటివ్ గా ఉంటుందని చెప్పుకుంటున్నారు. ఈ నేపథ్యంలో అధిష్ఠానం అభ్యర్థిగా ఎవరిని ఎంపిక చేస్తుందన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. టికెట్ ఎవరికి దక్కినా.. మిగిలినవారంతా కలిసి పార్టీ గెలిచేలా ఐకమత్యంతో పని చేయాలన్న మాటను తీసుకున్నట్లుగా చెబుతున్నారు. మరి.. అధిష్ఠానం ఎవరిని ఎంపిక చేస్తుందో చూడాలి.

## హైదరాబాద్‌లో దంచికొడుతున్న వర్షం.. మూసీ ఉగ్రరూపంతో రాకపోకలు బంద్

హైదరాబాద్: బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం, క్యూములో నింబస్ మేఘాల ప్రభావంతో తెలంగాణలో మరో రెండు రోజులపాటు మోస్తరు నుంచి భారీ వర్షాలు కురవనున్నాయి. హైదరాబాద్ లో గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలమయం అవుతున్నాయి. పలు రద్దీ ఏరియాలలో రూడ్లపై ట్రాఫిక్ నిలిచిపోయి వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. హైదరాబాద్లో సోమవారం నాడు సైతం మోస్తరు నుంచి భారీ వర్షాలు కురవనున్నాయని తెలంగాణ వెదర్ మ్యాన్ తెలిపారు. రాత్రిపూట వనపర్తి, నాగర్కర్నూల్, నల్గొండ జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురుస్తుందన్నారు.

మరో భారీ వర్షానికి సిద్ధంగా ఉండాలన్న వాతావరణశాఖ

రానున్న 2 గంటల్లో నిర్మల్, నిజామాబాద్, సిరిసిల్ల, సిద్దిపేట, కామారెడ్డి, మెదక్, సిద్దిపేట, సంగారెడ్డి, రంగారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురవనున్నాయి. ఊహించినట్లుగానే, తుఫాను తీవ్రతరం అవుతుంది. నగరవాసులు మరో భారీ వర్షానికి సిద్ధంగా ఉండండి. నార్సింగి, గచ్చిబౌలి, నానక్రామ్గూడ, మణికొండ, ఖాజాగూడ, షేక్పేట్, టోలిచౌకి, అత్తాపూర్, సెర్లింగంపల్లి, పటాన్చెరులలో మోస్తరు వర్షాలు కురిశాయి. నగరంలోని జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, ఫిలింనగర్, పంజాగుట్ట, అబిడ్స్, ఖైరతాబాద్, దిల్ సుఖ్ నగర్, యూసఫ్ గూడ, బోరబండ తదితర ప్రాంతాలల్లో వర్షం పడుతోంది క్రమంగా నగరంలోని ఇతర ప్రాంతాల్లోనూ వర్షాలు కురుస్తాయని, ఈ ఉదయం మీ ప్రయాణాన్ని అందుకు అనుగుణంగా ప్లాన్ చేసుకోవాలని సూచించారు.

ఆ జిల్లాల్లో భారీ వర్షాలు.. ప్రజలకు అలర్ట్

కామారెడ్డి, మెదక్, సంగారెడ్డి, నిర్మల్ జిల్లాల్లో నేడు భారీ వర్షాలు కురవనున్నాయి. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. సాయంత్రం నుంచి రాత్రిపూట వాయువ్య తెలంగాణ జిల్లాల్లో భారీ వర్షాలు పడతాయి. కామారెడ్డి, మెదక్, సంగారెడ్డి, నిర్మల్లో రాబోయే 2 గంటల పాటు



భారీ వర్షాలున్నాయి. వికారాబాద్, రంగారెడ్డి, సిద్దిపేట జిల్లాల్లోనూ పలుచోట్ల అధిక వర్షపాతం నమోదు కానుంది. ఈ జిల్లాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ వెదర్ మ్యాన్ సూచించారు. వర్షం కురిసే సమయంలో చెట్ల కిందగానీ, పాత బిల్డింగ్ కింద తలదాచుకోవడానికి వెళ్లవద్దని.. పిడుగులు పడతాయని, పాత భవనాలు కూలిపోయే అవకాశం ఉందని హెచ్చరించారు.

మూసీ ఉగ్రరూపం.. నిలిచిపోయిన రాకపోకలు

భారీ వర్షంతో హైదరాబాద్ తడిసి ముద్దయింది. వర్షం ధాటికి నగరంలోని పలు ప్రాంతాల్లో కరెంట్ సరఫరా నిలిచిపోయింది. వరుసగా కురుస్తున్న వర్షాలకు హైదరాబాద్ చిగురుటాకులా వణుకుతోంది. అసలే మూసీ ఉగ్రరూపం దాల్చుతోంది. యాదాద్రి భువనగిరి జిల్లాలో రుద్రవెల్లి వద్ద లో లెవెల్ బ్రిడ్జిపై నుంచి మూసీ వరద ప్రవహిస్తోంది. మూసీ ప్రవాహంతో భూదాన్ పోచంపల్లి - బీబీనగర్ మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. వలిగొండ మండలం భీమలింగం కత్వ వద్ద లోలెవెల్ బ్రిడ్జిపై నుంచి మూసీ వరద నీరు ప్రవహిస్తోంది. చౌటుప్పల్ - భువనగిరి మధ్య సైతం మూసీ వరద ప్రవాహంతో రాకపోకలు నిలిచిపోయాయి.

## సీఎం రేవంత్ రెడ్డితో ఎలి లిల్లీ సంస్థ ప్రతినిధుల కీలక భేటీ

హైదరాబాద్ : సీఎం రేవంత్ రెడ్డితో ఐసీసీసీలో ఎలి లిల్లీ సంస్థ ప్రతినిధులు భేటీ అయ్యారు. భేటీలో మంత్రి డి. శ్రీధర్ బాబు, ఎలి లిల్లి సంస్థ ప్రెసిడెంట్ ప్యాట్రిక్ జాన్సన్, లిల్లీ ఇండియా ప్రెసిడెంట్ విన్సెలో టుకర్, ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి సంజయ్ కుమార్, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్ లో రూ. 9 వేల కోట్లతో మ్యానుఫ్యాక్చరింగ్ ప్లాంట్, క్వాలిటీ సెంటర్ ఏర్పాటు చేయడానికి ఎలి లిల్లీ సంస్థ తన అంగీకారం తెలిపింది. ఈ భేటీపై సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ హైదరాబాద్ లో రూ..9వేల కోట్ల పెట్టుబడులకు ఎలి లిల్లీ సంస్థ తన అంగీకారం తెలుపడాన్ని అభినందించారు. తెలంగాణపైన నమ్మకం వచ్చినందుకు ధన్యవాదాలు అన్నారు. తెలంగాణ అంటేనే బిజినెస్ అని..హైదరాబాద్ గ్లోబల్ సిటీ గా ఎదిగిందని..పరిశ్రమలు పెట్టే వారికి మా ప్రభుత్వం అన్ని రకాలుగా మద్దతు ఇస్తుందని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

ఫార్మా హబ్ గా హైదరాబాద్

1965లో అప్పటి ప్రధాని ఇందిరా గాంధీ హైదరాబాద్ కి ఐడీపీఎల్ తీసుకు రావడం ద్వారా నగరం ఫార్మా హబ్ కేంద్రంగా మారిందన్నారు. హైదరాబాద్ లో నేడు అనేక దిగ్గజ ఫార్మా కంపెనీలు ఉన్నాయని..40 శాతం బల్క్ డ్రగ్స్ హైదరాబాద్ లో ఉత్పత్తి అవుతున్నాయని గుర్తు చేశారు. కోవిడ్ వ్యాక్సిన్ లు




హైదరాబాద్ లోనే ఉత్పత్తి అయ్యాయన్నారు. ఫార్మా పాలసీ ని మా ప్రభుత్వం మరింత ముందుకు తీసుకు వెళ్తుందని తెలిపారు. జినోమ్ వ్యాలీ లో ఏటీసీ సెంటర్ ను ఏర్పాటు చేస్తున్నాం అని, జినోమ్ వ్యాలీకి కావాల్సిన టెక్నికల్ సపోర్ట్ అందిస్తాం అని వెల్లడించారు. ఆనంద్ మహీంద్రా నేతృత్వంలో స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తున్నాం అని, ఫార్మ్ కు సంబంధించిన అనేక మంది ప్రముఖులు స్కిల్ యూనివర్సిటీ బోర్డు మెంబర్స్ గా ఉన్నారన్నారు.

## సంపాదకీయం

మంగళవారం 07-10-2025

# అక్రమాల వరదలో నగరాలు విలవిల

నీరు పల్లమెరుగు... నిజం దేవుడెరుగు అంటారు పెద్దలు. ఏకధాటిగా వానలు కురుస్తున్నప్పుడు వరదనీరు అంతా తన దారిలో తాను పోతూ దగ్గరిలోని చెరువులు, కుంటలు వంటివాటిలోకి చేరుతుంది. స్థానిక ప్రజల తాగు, సాగు అవసరాలు తీరుస్తుంది. భూగర్భ జలాల పెంపు, ఉష్ణతాపం తగ్గింపు, జీవవైవిధ్య పరిరక్షణలోనూ కీలకపాత్ర పోషిస్తుంది. ప్రకృతికి జీవనాడులైన ఆ జలవనరులు కబ్జాల కోరల్లో చిక్కి శల్యమైతే! అవి కనుమరుగైతే ప్రజాజీవనం అతలాకుతలం కాదా? దురదృష్టవశాత్తు ప్రస్తుతం కాంక్రీట్ కీకారణ్యాలుగా పేరుగాంచిన పట్టణాలూ నగరాల్లో జరుగుతోంది అదే!కట్టుతప్పుతున్న భూతాపం, వాతావరణ మార్పుల మూలంగా ఇటీవల కుండపోత వానలు విరుచుకుపడుతున్నాయి. వాటివల్ల విపరీతమైన జనసాంద్రత కలిగిన భారతీయ నగరాలు వరదల గుప్పిట చిక్కి విలవిల్లాడుతున్నాయి. రోడ్లపైకి భారీగా వాననీరు చేరి కిలోమీటర్ల కొద్దీ ట్రాఫిక్ నిలిచిపోయి స్థానికులు నరకం అనుభవిస్తున్నారు. ఈ బాధలు తప్పాలంటే ఏం చేయాలి! వరద నీరు సాఫీగా వెళ్లే ఏర్పాట్లు ఉండాలి. ముఖ్యంగా స్థానిక జల వనరులను కంటికి రెప్పలా కాచుకోవాలి. కానీ, వాటి గురించి పట్టించుకుంటున్న వారెవరు? కొన్నేళ్లుగా స్థిరాస్తి రంగానికి రెక్కలొచ్చాయి. వలసలు పెరుగుతున్న నేపథ్యంలో పట్టణ భూముల్లో ప్రతి అంగుళమూ బంగారు తునకగా మారింది. దాంతో కబ్జారాయుళ్ల కళ్లు చెరువులూ కుంటలపై పడుతున్నాయి. ఏ వైపు నుంచి ఎలా డబ్బు దండుకోవాలన్న ధ్యాసే తప్ప నిజమైన ప్రజాసంక్షేమం పట్టని నాయకుల అండదండలూ వారికి దండిగా అందుతున్నాయి. లంచాల కోసం అనుక్షణం అర్రులుచాచే కొందరు అధికారుల సంగతి ఇక సరేసరి. ఇంకేముందీ! ఇలాంటి వాళ్ల గూడుపుఠాణీలతోనే హైదరాబాద్‌లో పుప్పాలగూడ, మియాపూర్, మూసాపేట వంటి చోట్ల చెరువు భూముల్లోనే వందల కోట్ల రూపాయల విలువైన భారీ భవనాలు యథేచ్ఛగా మొలుచుకొస్తున్నాయి. నేతలూ అధికారుల సహకారంతో అక్రమ నిర్మాణదారులు ఎలాంటి వెరపూ లేకుండా దందాలు కొనసాగిస్తున్నారు. వారు కట్టిన ఇళ్లు కొనుగోలు చేసిన అమాయకులు తరవాతి కాలంలో జడివానలకు తమ నివాస ప్రాంతాలు మునిగి బావురుమంటున్నారు! కేంద్ర జల్‌శక్తి శాఖ గణన ప్రకారమే దేశవ్యాప్తంగా 38 వేల జలవనరులు ఆక్రమణల పాలయ్యాయి. వీటిలో అత్యధికం ఉత్తర్ ప్రదేశ్, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లోనే ఉన్నాయి. చెరువులూ కుంటలను నామరూపాలు లేకుండా చేయడమంటే స్థానిక జలావరణ వ్యవస్థను చావుదెబ్బ తీయడమే! జేబులు కొట్టే చిల్లర దొంగలనే జైళ్లకు పంపుతున్నప్పుడు– పర్యావరణాన్నీ జనజీవితాలను సర్వనాశనం చేస్తున్న అవినీతి అసురగణాలకు ఇంకెంత కఠిన శిక్షలు పడాలి?హైదరాబాద్, దాని చుట్టుపక్కల గతంలో వేల సంఖ్యలో చెరువులుండేవి. వాటన్నింటి నడుమ చల్లటి వాతావరణంలో భాగ్యనగరవాసుల జీవనం ప్రశాంతంగా చాలా ఉల్లాసంగా సాగేది! కాలక్రమంలో నగరంలోని చాలా చెరువులు ఇళ్లు, నివాస స్థలాలుగా మారిపోయాయి. తాజా అధ్యయనం ప్రకారం– 2000లో హైదరాబాద్‌లో జలవనరుల విస్తీర్ణం పన్నెండున్నర వేల హెక్టార్లుంటే, రెండు దశాబ్దాల కాలంలో అది రెండువేల హెక్టార్లకు కుంచించుకుపోయింది. అదే కాలంలో నగరంలో నిర్మాణ ప్రాంతాల వైశాల్యం రెట్టింపయ్యింది. దాంతో జోరుగా వర్షాలు పడుతున్నా– అక్రమ కట్టడాల పుణ్యమా అని నీరింకే మార్గంలేక నగరంలో భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయి. ఎండాకాలంలో ట్యాంకర్ల దగ్గర నీటికోసం కుస్తీలు అనివార్యమవుతున్నాయి!బెంగళూరు నీటి అవసరాలు తీర్చేందుకు ఆ నగర నిర్మాత కెంపేగౌడ వేల సంఖ్యలో చెరువుల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. కాలక్రమంలో కబ్జారాయుళ్ల ధాటికి ఆ నగరంలో 837 చెరువులు మాయమయ్యాయి. అధికారిక లెక్కల ప్రకారమే రాష్ట్ర విభజనకు ముందు హైదరాబాద్‌లో 920 చెరువులుంటే, అనంతర కాలంలో 171 కనుమరుగయ్యాయి. తెలంగాణలో సాగు, తాగు అవసరాలు తీర్చేందుకు కాకతీయులు గొలుసుకట్టు చెరువులు నిర్మించారు. కాలగతిలో వాటిలో చాలావరకు ఆక్రమణలకు గురవడంతో వరంగల్ తరచూ ముంపు బారిన పడుతోంది. ఖమ్మం, నల్గొండ, నిజామాబాద్, కరీంనగర్, మహబూబాబాద్ వంటి చోట్ల చెరువులు అన్యాక్రాంతమయ్యాయి. తిరుపతి, నెల్లూరు, కడపల్లోనూ చాలా చెరువులు మాయమవడంతో ఆయా నగరాలను వరదలు చుట్టుముడుతున్నాయి. నిరుడు విజయవాడ జలసంద్రమవడానికి బుడమేరు దురాక్రమణలే కారణం. చెన్నైలోనూ జలవనరులు బాగా తరిగిపోవడంతో ఆ నగరం తరచూ భీకర వరదలను చవిచూస్తోంది. ఇలా కుంటలు చెరువులను మింగేస్తూ– మనకి పోయేదేముంది.. పూడ్చేద్దాం.. కట్టేద్దాం.. డబ్బు దండుకుందాం అన్నట్లు చెలరేగిపోతున్న వారంతా సామాజిక ద్రోహులే. వారితో ఊచలు లెక్కపెట్టించలేకపోతే– ప్రజాప్రయోజనాల పరిరక్షణలో పాలకులు విఫలమైనట్లే. పురపాలికల్లో అవినీతి అధికారులను ఏరిపారేస్తూ, జలవనరుల సంరక్షణకు 'హైడ్రా' వంటి వ్యవస్థలను అన్ని నగరాల్లోనూ ఏర్పాటు చేయాలి. పురాతన కాలం నాటి వరద కాలువలను ఆధునికీకరించాలి. అన్నింటికన్నా ముఖ్యంగా పట్టణాలకు బృహత్ ప్రణాళికలు రూపొందించి అవి సమర్థంగా అమలయ్యేలా చర్యలు తీసుకోవాలి. నత్తకు నడకలు నేర్పడంలో ఎప్పుడూ ముందుండే ప్రభుత్వాలు వీటన్నింటి పట్ల వేగంగా స్పందిస్తేనే నగర జీవనం నరకమయం అన్న అపప్రథ తొలగిపోతుంది!

# పాలస్తీనా హసించేనా?



మొదట గాజాలో శాంతి స్థాపన, తర్వాత పాలస్తీనా దేశం ఏర్పాటు అంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సెప్టెంబర్ 30 నాడు 20 అంశాల ప్రణాళిక ఒకటి ప్రకటించారు. ఆ సమయంలో తన పక్కన నిల్చుని ఉన్న ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ, తాను దానిని ఆమోదిస్తున్నానని చెప్పారు. ఇంతవరకు అమెరికా, ఇజ్రాయెల్, హమాస్‌ల చర్చలలో మధ్యవర్తిత్వం వహిస్తున్న ఈజిప్ట్, ఖతార్, టర్కీలు ఆ పథకం తమకు సమ్మతమేనంటూ, అంగీకారం తెలపవలసిందిగా హమాస్‌ను కోరాయి. అంగీకరించేందుకు హమాస్‌కు 34 రోజుల సమయం ఇస్తున్నానని, ఒకవేళ కాదంటే ఇజ్రాయెల్, అమెరికాలు కలిసి ఆ సంస్థను సర్వనాశనం చేయగలవని ట్రంప్ హెచ్చరించారు. ఆ గడువు ఈ 4, 5 తేదీలలో (శని, ఆదివారాలు) ముగుస్తుంది. హమాస్ నాయకత్వం ఆ ప్రణాళికను పరిశీలిస్తున్నట్లు చెప్పింది. 2వ తేదీ గురువారం మధ్యాహ్నం వరకు ఇంకా ఎటువంటి స్పందన వెలువడలేదు. మరొక వైపు నెతన్యాహూ ఆ ప్రణాళికతో తమ "యుద్ధ లక్ష్యాలన్నీ నెరవేరగలవ'ని ప్రకటించటం గమనించదగ్గది. 20 అంశాల ప్రణాళికను హమాస్ యథాతథంగా అంగీకరిస్తుందా? ఏమైన అంశాలపై వివరణలు కోరుతుందా? ఏవైనా సూచనలు చేయవచ్చునా? ఏదీ ఇతరులు చెప్పగలది కాదు. సందేహాలు మాత్రం ఉన్నాయి. ఎందుకంటే, అందులో మంచి చెడుల మాట అట్లుంచి, ఆ ప్రణాళిక అమెరికా, ఇజ్రాయెల్ మధ్యవర్తి దేశాలు, మునుముందు తాత్కాలిక గాజా పరిపాలనను నిర్వహించగలరంటున్న బ్రిటిష్ మాజీ ప్రధాని టోనీ బ్లెయిర్‌ల మధ్య సంప్రదింపులతో మాత్రమే రూపు తీసుకున్నది తప్ప, హమాస్ అభిప్రాయాలను కోరలేదు. వాటికి అవునంటారా, కాదంటారా అనేది అట్లుంచి, కనీసం లాంఛన ప్రాయంగానైనా కోరలేదు. అంతేకాదు, వెస్ట్ బ్యాంక్ ప్రాంతాన్ని పాలిస్తున్న పాలస్తీనా అథారిటీ (పిఎ) ప్రతిపాదనలను కూడా అడగలేదు. పాలస్తీనా అథారిటీ, హమాస్‌లు ప్రత్యర్థులే కావచ్చు. కాని ఆరెండు సంస్థలూ పాలస్తీనాకు చెందినవి. పైన పేర్కొన్న తక్కిన అందరూ బయటివారు. వారంత కలిసి తమ ఆలోచనలతో ఒక పత్రాన్ని పూర్తి ఏకపక్షంగా తయారు చేసారు. కనీసం దాని గురించిన అభిప్రాయాలనైనా అడగటం లేదు. మేము చేసాము, మీరు ఒప్పుకుని తీరాలని అంటున్నారు. అందుకు కొద్ది రోజుల గడువు విధించారు. ఆలోగా అంగీకరించని పక్షంలో ఇజ్రాయెల్, అమెరికాలు కలిసి 'సర్వనాశనం' చేయగలమంటున్నారు. నిజానికి ఆ ఇరువురూ తోపై ఇంతకాలం ఆ పని చేస్తూనే వస్తున్నారు. ఆ పని క్షేత్రస్థాయిలో ఇజ్రాయిల్ చేస్తుండగా, వారికి అమెరికా ఆయుధాలను, నిధులను సమకూరుస్తున్నాది. ట్రంప్ ప్రణాళికను ఆమోదిస్తున్నట్లు నెతన్యాహూ సెప్టెంబర్ 30న ప్రకటించగా, ఆ తర్వాత రోజులలోనూ ఇజ్రాయెల్ హత్యాకాండ సాగుతూనే ఉంది. అమెరికా సరఫరాలు సాగుతూనే పోయాయి. ఆ చర్యలు ఆపాలని ట్రంప్ చెప్పలేదు. అనగా, పాలస్తీనా భూమికి సంబంధించి ఇంచుమించు 20వ శతాబ్దం ఆరంభంలో మొదలైన సామ్రాజ్యవాదుల చదరంగం 125 సంవత్సరాలు గడిచిన తర్వాత నేటికి కూడా ఏదో ఒక పద్ధతిలో కొనసాగుతూనే ఉందన్న మాట. చివరకు హమాస్ ఏమనవచ్చునో, విషయం ఏ విధంగా తేలవచ్చునో అనేది అట్లుంచి, ట్రంప్ ప్రణాళికలో కనిపించే సానుకూల అంశాలేవో, చిక్కు ప్రశ్నలేవో చూడాలి. పైనుంచి కింద వరకు ఒక వరుసలో వెళితే కనిపించే సానుకూల అంశాల ఈ విధంగా ఉన్నాయి. ఈ ప్రణాళికను ఉభయులూ ఆమోదిస్తే యుద్ధం వెంటనే నిలిచిపోతుంది. ఇజ్రాయెల్ సేనలు కొంత వెనుకకు తగ్గి, బందీల విడుదల కోసం వేచిచూస్తాయి. ఈ కాలంలో సైనిక చర్యలన్నీ సస్పెండ్ మాత్రం చేస్తారు. ఉభయులు దళాలు ఎక్కడివక్కడ నిలిచిపోతాయి. బందీలను ఉభయులూ విడుదల చేసిన తర్వాత గాజాలో తాత్కాలిక పరిపాలన ఏర్పడుతుంది. ఆ బోర్డుకు అధ్యక్షుడు అమెరికా అధినేత కాగా, వేర్వేరు దేశాలకు చెందిన నిపుణులు ఉంటారు. కొందరు పాలస్తీనా నిపుణులు కూడా. గాజా వదలి వెళ్లవలసిందిగా ఎవరినీ వత్తిడి చేయరు. వెళ్లగోరే వారు మాత్రం వెళ్లవచ్చు. తిరిగి రావచు. ఇజ్రాయెల్ గాజాను ఆక్రమించుకోదు. గాజా అభివృద్ధికి సంబంధించిన అన్ని నిబంధనలు 'సంతృప్తికరంగా' సాగే పక్షంలో, పాలస్తీనా అథారిటీ కూడా 'సంస్కరణలకు' గురైనట్లయితే పాలస్తీనా స్వయం నిర్ణయాధికారానికి, స్వతంత్ర దేశం ఏర్పాటుకు తగిన పరిస్థితులు అపుడు 'ఏర్పడవచ్చు'. మొత్తం 20 అంశాలలో ఏదో ఒక మేరకు సానుకూలంగా తోచేవి ఇవి మాత్రమే. కాని, వీటితో సహా తక్కిన వాటిని నిశితంగా పరిశీలించి నట్లయితే, వాటిలో అత్యధికం ఇజ్రాయెల్, అమెరికాల ఆధిపత్యంతోపాటు ప్రత్యక్ష, పరోక్ష నియంత్రణలను కొనసాగించేవిగానే అర్థమవుతాయి. అసలు ఆ ప్రణాళికే హమాస్‌కు ఒక ఉచ్చును పన్నటంగా అర్థమవుతుంది. ఏ విధంగానో ఒక్కొక్కటిగా చూద్దాము (1) పొరుగువారికి ప్రమాదకారి కాని విధంగా గాజాను డీ రాడికలైజ్ చేసి, టెర్రర్ ఫ్రీ జోన్‌గా మార్చుతాం. అక్కడ రాడికల్, టెర్రర్ ధోరణులు మొదటి నుంచి లేవు. ఇజ్రాయెల్, అమెరికాల విధానాలు, పాలస్తీనా దేశాన్ని నిరాకరించటం వల్లనే తలెత్తాయి. పాలస్తీనా ఏర్పడితే వాటంతట అవే సమసిపోతాయి. పాలస్తీనా ఏర్పాటుపై ఆ ప్రణాళికలో డొంక తిరుగుడుతనం, అస్పష్టతలు అనేకం ఉన్నాయి. అటువంటపుడు వీరి ఉద్దేశం రాడికలిజం పేరిట స్వతంత్ర ధోరణులను, యువతను ఈలోపే అణచివేయటమని తోస్తుంది. (2) ప్రజల మేలుకోసం గాజాను అభివృద్ధి పరచటమంటే ట్రంప్‌నెతన్యాహూల రియల్ ఎస్టేట్ ఆలోచనను దృష్టిలో ఉంచుకునా? తమ మేలు ఏమిటో నిర్ణయించుకునే అధికారం అక్కడి ప్రజలకు ఉంటుందా? (3) ఈ ప్రతిపాదనకు హమాస్ అంగీకరించినా ఇజ్రాయెల్ దాడులు ఆగి, సైన్యం 'యథాస్థానంలో' ఆగిపోతుంది తప్ప పూర్తిగా ఉపసంహరించుకోదు. దశల వారీగా, పూర్తిగా ఉపసంహరించునేందుకు 'తగిన పరిస్థితులు' ఏర్పడే వరకు (?) అక్కడే ఉండిపోతాయి. ఈ 9వ వివరమైన అంశం సారాంశం ఏమంటే, భవిష్యత్తులో ఎప్పటికైనా పాలస్తీనా దేశం ఏర్పడే లోగా అక్కడ దశ దిశ యావత్తూ అమెరికా, దాని మిత్రులు నిర్దేశించే విధంగా రూపుదిద్దుకుంటాయి. బోర్డ్ ఆఫ్ పీస్ పేరిట నెలకొల్పే ప్రధాన సంస్థకు ట్రంప్ అధ్యక్షుడవుతారు. అందులో టోనీ బ్లెయిర్ తోపాటు మరికొద్ది దేశాల అధినేతలు సభ్యులవుతారు. రోజువారీ పరిపాలన కోసం ఒక తాత్కాలిక ప్రభుత్వం ఏర్పడుతుంది. అందులో నిపుణులైన పాలస్తీనియన్లతో పాటు అంతర్జాతీయ నిపుణులుంటారు. 2020 నాటి ట్రంప్ ప్రతిపాదనలు, సౌదీ ఫ్రెంచ్ ప్రతిపాదనలకు అనుగుణంగా పాలస్తీనా అథారిటీ 'తనను తాను సంస్కరించుకుని', పరిపాలనను స్వయంగా చేపట్టేందుకు 'సిద్ధమయే వరకు' ఈ ఏర్పాట్లు కొనసాగుతాయి. ఇపుడు ఈ అంశంలోని తెలివైన మెలికలను గమనించండి. యుద్ధ విరమణ జరిగి శాంతి ఏర్పడితే, పరిపాలన పోయేది అమెరికా అధ్యక్షుని బోర్డుతోపాటు, ఒక బయటి తాత్కాలిక ప్రభుత్వం చేతులోకి. పాలస్తీనియన్ల పాత్ర స్వల్పం. పాలస్తీనా అథారిటీ అనేది యథాతథంగానే బలహీనంగా మారి అమెరికా, ఇజ్రాయెల్ కనుసన్నలలో పని చేస్తున్నది. అటువంటి దిష్టి బొమ్మకైనా కొత్తగా ఏర్పడగల ఈ రెండు వ్యవస్థలలో నామకార్థపు పాత్ర మాత్రమే. భవిష్యత్తులో ఎపుడో అధికారం అప్పగించినా దాని స్థితి ఎట్లుండేదీ చెప్పనక్కర లేదు. ఈలోగా కూడా దానిని హాలులో ఒక పక్క కూర్చోబెడతారన్నమాట. అధికారం స్వీకరించగలగటానికి దానికి ఎన్ని షరతులు పెట్టారో గమనించండి. ఇక ఈ బోర్డులు, ప్రభుత్వాలు చేపట్టగల అభివృద్ధి నమూనా ఎవరి కోసం తయారవుతుందో ఎవరైనా ఊహించవచ్చు. గల్ఫ్, పశ్చిమాసియా ప్రాంతంలో సామ్రాజ్యవాదానికి మొదటి నుంచి రెండు ప్రయోజనాలున్నాయి. ఒకటి, అక్కడి ఇంధన నిల్వలు. రెండు, భౌగోళిక వ్యూహాల రీత్యా ఆ ప్రాంతం కీలకం కావటం. మూడవది ట్రంప్‌తో పాటు ఆయన కుటుంబ సభ్యులకు ఇటీవల కలిగిన రియల్ ఎస్టేట్ ఆసక్తి. ఇపుడు ట్రంప్, నెతన్యాహూలు కలిసి ఇంతకాలం యుద్ధం ద్వారా గాని, ఇపుడు శాంతి పేరిట గాని నెరవేర్చుకొనజూస్తున్న ప్రయోజనాలు ఇవేనన్న సందేహం కలగక మానదు. 10వ అంశాన్ని గమనిస్తే, ఇది కేవలం సందేహం కాదని, వాస్తవమని అర్థమవుతుంది. అంశంలో ఆధునిక నగారాల నిర్మాణం, అంతర్జాతీయ పెట్టుబడులు, అందుకు వీలు కలిగించేట్లు పరిపాలనను, భద్రతను సమన్వయం చేయటం గురించి సూటిగానే రాసారు. అందుకోసం ఒక సెజ్ ఏర్పాటు చేయగలమని 11వ అంశం ప్రకటిస్తున్నది.

# పోలవరం ఆలస్యానికి కారకులు మీరు కాదా?

పోలవరం:పోలవరాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ 2027 డిసెంబర్ నాటికి పూర్తి చేయడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు పట్టువదలని విక్రమార్కుడిలా వ్యవహరిస్తుండ టంతో వైసీపీ నాయకులకు కంటిమీద కునుకు లేకుండా బాధపడుతున్నారు. ఇప్పటికే ఆ ప్రాజెక్టు నిర్మాణం 84 శాతం పూర్తి కావడంతో వారికి దిక్కుతోచడం లేదు. అందుకే పోలవరం నిర్మాణంలో తమ పాత్ర కూడా ఉందని చెప్పి ప్రజలను మభ్యపెట్టడానికి పోలవరంపై బరితెగించి అబద్ధాలకు తెగబడుతున్నారు..పోలవరం ప్రాజెక్టును చంద్రబాబు నాశనం చేశారని, చంద్రబాబు రూ. 20 వేల కోట్లకు ఒప్పుకొంటే తాము రూ. 47 వేల కోట్లకు ఒప్పించామని, పోలవరంపై కేంద్రాన్ని కనీసం అడిగే పరిస్థితిలో కూటమి లేదని పచ్చి అబద్ధాలకు తెగబడ్డాడు మాజీ మంత్రి బుగ్గన. నేడు పోలవరం నాశనంలో కీలకపాత్ర పోషించిన వ్యక్తులు పోలవరంపై మొసలి కన్నీరు కార్చడం చూసి జనం నవ్వుకుంటున్నారు. 2014-19 మధ్య ప్రాజెక్ట్ పురోగతిని పరిశీలిస్తే సీఎం చంద్రబాబు 31 సార్లు ప్రాజెక్టు పనులను పర్యవేక్షించారు. 104 సార్లు వర్చువల్‌గా ప్రాజెక్టు పనులు పరిశీలించారు. ప్రభుత్వం నిరంతర పర్య వేక్షణలో దాదాపు 72 శాతం ప్రాజెక్టు పనులు పూర్తి అయ్యాయి.

మూడు శాతం పనులే జరిగాయి..

రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ తెలుగుదేశం ప్రభుత్వం ప్రాజెక్ట్ పనులు ఆగకుండా తక్షణం అవసరమైన నిధులను రాష్ట్ర ఖజానా నుండి సమకూర్చింది. కేంద్రం నుండి నిధుల విడుదల కోసం వేచి చూడకుండా జాప్యం లేకుండా పనులు కొనసాగించింది. 2019 జూన్ నుండి జగన్ అధికారంలోకి వచ్చిన వెంటనే రివర్స్ టెండర్స్ పేరుతో ప్రత్యామ్నాయం చూపించకుండా కాంట్రాక్టర్‌ను తొల గించి 16 నెలలు కాంట్రాక్టర్‌ను నియమించలేదు. అనాలోచిత, అసంబద్ధ నిర్ణయాల వల్ల 2020 లో వచ్చిన వరదలకు డయా ఫ్రమ్ వాల్ డ్యామేజ్ అయి రూ.2745 కోట్ల అదనపు భారం పడింది. పనులు ప్రణాళిక, షెడ్యూల్ ప్రకారం జరగకపోవడం, డిజైన్ ఖరారులో జాప్యం, అవసరమైన సిబ్బంది, యంత్రాల సమీకరణలో జాప్యం మూలంగా డయా ఫ్రమ్ వాల్ డ్యామేజీ అయినట్లు ఐఐటీ హైదరాబాద్ నివేదిక ఇచ్చింది. జగన్ పాలన ఐదేళ్లలో కేవలం ప్రాజెక్టు పనులు 3.84 శాతం మాత్రమే జరిగాయి.

ఇవన్నీ చేసింది మీరు కాదా?

భూసేకరణ, తగినంత నిధులు కేటాయించకపోవడం ఆర్ ఆర్ పనులు ప్రాజెక్ట్ పురోగతిని తీవ్రంగా ప్రభావితం చేసింది. పెండింగ్ బిల్లులు చెల్లించకపోవడంతో ప్రాజెక్టు నిర్మాణంలో ఉన్న అన్ని కార్య నిర్వాహక ఏజెన్సీలు 2024 మే నాటికి పనులు నిలిపి వేసింది వాస్తవం కాదా? నాటి సీఎం జగన్ పోలవరం ప్రాజెక్టును



పూర్తి చేస్తామని 4సార్లు గడువులు ప్రకటించి 5వ సారి ప్రాజెక్టు ఎప్పుడు పూర్తి అవుతుందో చేతులెత్తేసింది నిజం కాదా? టీడీపీ హయాంలో పోలవరానికి ఖర్చు చేసిన నిధులను కేంద్ర ప్రభుత్వం రీయింబర్స్ చేస్తే ఆ నిధులు పోలవరానికి ఖర్చు పెట్టకుండా రూ.3,385.58 కోట్లు దారి మళ్లించి పోలవరంను ముంచింది మీరు కాదా? ఈ ప్రాజెక్ట్‌ను 2022లో ఫేజ్-1, ఫేజ్-2గా విభజించింది మీరు కాదా? ఎన్నికలకు ముందు పోలవరం నిర్వాసితులకు అదనంగా ఎకరానికి 10 లక్షలు పరిహారం ఇస్తానని, అధికారంలోకి వచ్చాకా వారిని మోసం చెయ్యలేదా? పునరావాస కాలనీల నిర్మాణానికి ఒక్క రూపాయి నష్టపరిహారం కానీ ఇవ్వకుండా వారిని మోసం చేసింది మీరు కాదా?

ఓర్వలేక ఈ అబద్ధాలు..

రాష్ట్రానికి చంద్రబాబు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి పోలవరంపై ప్రత్యేక దృష్టి సారించారు. ప్రాజెక్టును వేగవంతం చెయ్యడానికి, తిరిగి ట్రాక్‌లో పెట్టడానికి 15 నెలల్లోనే 3 సార్లు పోలవరం ప్రాజెక్టును సందర్శించి అధికారులతో సమీక్షించి పనులు పరుగులు పెట్టిస్తున్నారు. కేంద్ర జలశక్తి, కేంద్ర జలసంఘం, పోలవరం ప్రాజెక్టు అథారిటీ, రాష్ట్ర ప్రభుత్వం కలిసి విదేశీ నిపుణుల బృందాన్ని ఏర్పాటు చేయడం, ఆ బృందం ఏడాదిలో నాలుగుసార్లు పోలవరాన్ని సందర్శించి. ప్రాజెక్టును అసాంతం పరిశీలించి సమస్యలకు పరిష్కారాలు చూపిస్తున్నారు. డిసెంబర్ ఆఖరుకు డయా ఫ్రం వాల్ పూర్తి కానున్నది. మొత్తం హెడ్ వర్క్స్ డిసెంబర్ 2027 నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకొని కూటమి ప్రభుత్వం సర్వశక్తులు ఒడ్డుతుంటే వైసీపీ నాయకులు ఓర్వలేక ఈర్ష్య, ద్వేషంతో చంద్రబాబుపై అబద్ధాల విషం కక్కుతున్నారు. మొండి గురువు, బండ శిష్యులు మాదిరిగా బుగ్గన తమ తప్పులను యధా రీతిన కూటమి మెడకు చుట్టాలని చూశారు. అమాయక ముఖం పెట్టి పోలవరంపై గుండెలు బాదుకుంటూ కార్చే మొసలి కన్నీళ్లకు రాష్ట్ర ప్రజలు కరిగిపోరని వైసీపీ నాయకులు తెలుసుకోవాలి.

# ట్రంప్ చర్యలతో అప్రమత్తంగా ఉండాల్సిందే

న్యూఢిల్లీ,అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పుణ్యమా అని అనేక అనూహ్య ఘటనలు జరుగుతున్నాయి. ముఖ్యంగా భారత్ అనేక పాఠాలు నేర్చుకోవాల్సి ఉంది. ట్రంప్ ఏ రోజు ఎలాంటి ఆంక్షలు తెస్తారో తెలియకుండా ఉంది. మేకిన్ ఇండియా అంటున్న భారత్ ప్రధాని అందుకు తగ్గట్లుగా కార్యాచరణకు దిగాలి. స్వయం సమృద్ధి సాధించేలా ప్రయత్నాలు ప్రారంభించాలి. ముఖ్యంగా యువత ఊనైపుణ్యాలకు పదను పెట్టాలి. ఇకపోతే దాదాపు ఐదేళ్ల తర్వాత అక్టోబర్ 26 నుండి భారత్– చైనాల మధ్య విమాన రాకపోకల పున:ప్రారంభానికి కేంద్రం గ్రీన్ సిగల్ ఇచ్చింది. ఈ విషయాన్ని తాజాగా ఓ సీనియర్ ప్రభుత్వాధికారి వెల్లడించారు. శీతాకాలం ప్రారంభమయ్యే కాలంలో భారత్– చైనాల మధ్య నేరుగా విమాన రాకపోకల్ని అక్టోబర్ 26 నుండి పున:ప్రారంభించడానికి అంగీకరించినట్లు భారత విదేశాంగ మంత్రిత్వశాఖ ప్రకటించింది. మరోవైపు అక్టోబర్ 26 నుండి కోల్‌కతా– గ్వాంగ్‌జౌ రోజువారీ సేవలను ప్రారంభించనున్నట్లు ఇండిగో విమానయాన సంస్థ తెలిపింది. ఇరు దేశాల మధ్య నియంత్రణ ఆమోదాలు అమల్లోకి వచ్చిన తర్వాత న్యూఢిల్లీ నుండి చైనాకు రోజువారీ విమాన సేవలను అందుబాటులోకి తేనున్నట్లు ఇండిగో తెలిపింది. చైనా సదరన్ ఎయిర్‌లైన్స్, సిచువాన్ ఎయిర్‌లైన్స్‌లు కార్గో విమానాలకు అనుమతి కోరాయి. భారతీయ విమానయాన సంస్థలు ఇరు దేశాల మధ్య సేవల్ని కొనసాగించడానికి ఒప్పందానికి కట్టుబడి ఉన్నాయి. ప్రస్తుత ద్వైపాక్షిక ఒప్పందం ప్రకారం ఆరు గమ్యస్థానాలకు చేరుకోవడానికి వీలుకల్పిస్తుంది. అయితే వారంలో 42 విమానాల కంటే ఎక్కువ నడపకూడదని ఒప్పందంలో ఉంది. చైనా విమానాలు ప్రతివారం 42 విమానాలను నడుపుతున్నాయి. వాటిలో ఎయిర్ చైనా (బీజింగ్– ముంబై) వారానికి నాలుగుసార్లు, బీజింగ్ –ఢిల్లీకి ఐదుసార్లు సార్లు ప్రయాణీకుల రాకపోకల్ని కొనసాగిస్తున్నాయి. చైనా సదరన్ ఎయిర్‌లైన్స్ ఢిల్లీ–గ్వాంగ్‌జౌకు రోజుకు రెండుసార్లు సర్వీసుల్ని కొనసాగిస్తుంది. చైనా ఈస్టర్స్ ఎయిర్‌లైన్స్ వారానికి ఎనిమిది, వాటిలో రోజువారీ ఢిల్లీ– షాంఘై విమానాలను నడుపుతుంది. షాన్డాంగ్ ఎయిర్‌లైన్స్ కున్మింగ్ నుండి ఢిల్లీకి వారానికి నాలుగుసార్లు విమానాలను నడుపుతుంది. రువాండాకు చెందిన రువాండ్ ఎయిర్‌లైన్స్ కూడా వారానికి మూడుసార్లు గ్వాంగ్జౌ– ముంబైల మధ్య విమాన సర్వీసుల్ని కొనసాగిస్తుంది. భారతీయ విమానయాన సంస్థల్లో ఒకటైన ఎయిర్ ఇండియా న్యూఢిల్లీ నుండి వారానికి ఐదుసార్లు షాంఘైకి విమానాలను నడుపుతుంది. ఇండిగో కూడా చెంగ్డు– ఢిల్లీ, గ్వాంగ్జౌ– కోల్‌కతాల మధ్య రోజువారీ విమానలను నడిపింది. ఈ నేపథ్యంలో ప్రయాణీకుల, కార్గో విమానాల కోసం ఐదు చైనా ఎయిర్‌లైన్స్ డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డిజిసిఎ)ని సంప్రదించాయి. ÷ూగా, విమానాల రాకపోకలు పున:ప్రారంభించడానికి ఇక ఆలస్యం చేయకూడదని భారత్– చైనా నేతలు కోరుకుంటున్నారని ప్రభుత్వాధికారి పేర్కొన్నారు. ఇక ఇరు దేశాల మధ్య సంబంధాలు బలోపేతం చేసుకోవడానికి, ప్రభుత్వ వ్యూహంలో భాగంగా ఈ సంవత్సరం ప్రారంభం నుండి రెండు దేశాలు సాంకేతికస్థాయి చర్చలు జరుపుతున్నాయని, ఇందులో విమాన సేవా ఒప్పందం కూడా ఉందని భారత విదేశాంగశాఖ గురువారం విడుదల చేసిన ప్రకటన పేర్కొంది. ఇండిగోతోపాటు, ఎయిర్ ఇండియా కూడా ఈ ఏడాది చివరి నుంచి షాంఘైకి విమాన సర్వీసులను ప్రారంభించాలని యోచిస్తోంది. ఇక ఆకాశ విమానయాన సంస్థ కూడా అదే ఆలోచనలో ఉంది. చైనా నుంచి భారత్‌కు చేరే ప్రయాణీకుల కోసం చైనా కూడా షాంఘై –ఢిల్లీ (వారానికి ఐదు విమానాలు) విమాన సర్వీసులను ప్రారంభించింది. వీటికి డిజిసిఎ అనుమతినిచ్చింది. ప్రయాణీకుల విభాగంలో ఎయిర్ చైనా, షాన్డాంగ్‌లు దరఖాస్తు చేసుకున్నాయి. వీటితోపాటు ఇతర విమానయాన సంస్థలు కూడా దరఖాస్తు చేసుకున్నాయి.

# పొలిటికల్ అరంగేట్రంకు ప్లాన్..

హైదరాబాద్, ఆయన ఎమ్మెల్యే. వాళ్లమెను జడ్పీటీసీ ఛైర్మన్ చేయాలనుకుంటున్నారు. తండ్రి సీనియర్ లీడర్. వారసుడిగా కొడుకు పొలిటికల్ ఎంట్రీ కోసం లోకల్ బాడీ ఎన్నికల రంగంలోకి దిగబోతున్నారు. ఒకాయన కోడలను బరిలోకి దింపాలనుకుంటుంటే..మరొకాయన భార్యను పోటీలో పెట్టి గెలిపించుకోవాలని ఆరాటపడుతున్నారు. ఇలా తెలంగాణలో పలువురు నేతల వారసుల పొలిటికల్ ఎంట్రీకి సర్వం సిద్ధమవుతోంది. స్థానిక సంస్థల ఎన్నికలపై హైకోర్టు తీర్పు వస్తే చాలు..మరింత స్పష్టత రానుంది. స్థానిక పోరులో బరిలో దిగబోతున్న పొలిటికల్ వారసులు ఎవరు? ఎవరు ఎక్కడి నుంచి పోటీ చేయబోతున్నారు? ఏంటా ఈక్వేషన్స్?స్థానిక సంస్థల ఎన్నికల వేళ రాజకీయ నేతల వారసులు తెర మీదకు వస్తున్నారు. భవిష్యత్‌లో ఎమ్మెల్యేలుగా..ఎంపీలుగా ఉన్నత పదవులు చేపట్టాలని ఆశపడుతున్న రాజకీయ వారసులు..లోకల్ బాడీ పోల్స్‌లో గెలిచి పొలిటికల్ ఎంట్రీ ఇచ్చేందుకు రెడీ అవుతున్నారు. ప్రభుత్వ సలహాదారు..సీఎం రేవంత్ సన్నిహితుడు వేం నరేందర్‌రెడ్డి కుమారుడిని..గంగారం జడ్పీటీసీగా పోటీ చేయించే ఆలోచనలో ఉన్నారట.

జడ్పీటీసీలుగా గెలిచి పొలిటికల్ అరంగేట్రం చేయాలని ప్లాన్..

మహబూబాబాద్ జడ్పీ పీఠం జనరల్ కావడంతో.. ఆ పదవిని దృష్టిలో పెట్టుకుని కొడుకుని బరిలోకి దింపి జిల్లా స్థాయి పోస్ట్‌లో కూర్చోబెట్టాలని ఆశ పడుతున్నారట వేం నరేందర్ రెడ్డి. ములుగు జడ్పీ ఛైర్మన్ రేసులో మంత్రి సీతక్క కోడలు కుసుమాంజలి పేరు వినిపిస్తోంది. ఇక కామారెడ్డి జిల్లా జడ్పీ ఛైర్మన్ సీటు జనరల్‌కు రిజర్వ్ అయ్యింది. దీంతో కాంగ్రెస్ నుంచి బాన్సువాడ ఎమ్మెల్యే, మాజీ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి కుమారుడు పోచారం భాస్కర్‌రెడ్డి పోటీ పడబోతున్నారట. బీర్కూర్ నుంచి జడ్పీటీసీగా పోటీ చేసి జడ్పీ ఛైర్మన్ రేసులో ఉండాలని కలలు కంటున్నారట పోచారం భాస్కర్ రెడ్డి. బీఆర్ఎస్ నుంచి కామారెడ్డి మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ కుమారుడు గంప శశాంక్ పోటీ పడేందుకు ఆసక్తి చూపుతున్నారట. నిజామాబాద్ జడ్పీ ఛైర్మన్ పీఠం బీసీ మహిళకు రిజర్వ్ కావడంతో కాంగ్రెస్ నాయకురాలు ఆకుల లలిత పేరు ప్రధానంగా వినిపిస్తున్నది. బీఆర్ఎస్ నుంచి మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ కోడలు, లేదంటే ఆయన భార్యను పోటీలోకి దింపే అవకాశాలున్నట్లు పార్టీ నాయకులు చెబుతున్నారు.

రంగంలోకి లీడర్ల కూతుర్లు, కుమారులు, భార్యలు..

సంగారెడ్డి జడ్పీ పీఠం ఎస్సీ జనరల్‌కు రిజర్వ్ ?అయింది. ఈ స్థానం కోసం మంత్రి దామోదర రాజనర్సింహ.. తన కూతురు త్రిషను బరిలోకి దింపే ప్రయత్నం చేస్తున్నట్టు టాక్ వినిపిస్తోంది. ఆమె ఆందోల్ నియోజకవర్గంలోని చౌటకూరు నుంచి జడ్పీటీసీగా పోటీ చేస్తారని లోకల్ లీడర్లు చర్చించుకుంటున్నారు. ఆందోల్ మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ తమ్ముడు రాహుల్ కూడా పోటీలో ఉండబోతున్నారట.మెదక్ జడ్పీ ఛైర్మన్ పదవి జనరల్ క్యాటగిరికి రిజర్వ్ కావడంతో కాంగ్రెస్ నుంచి నర్సాపూర్ మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి ఛైర్మన్ పదవి ఆశిస్తున్నారట. ఇదే స్థానం కోసం మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి కూడా బీఆర్ఎస్ నుంచి బరిలో ఉండబోతున్నారని టాక్.రంగారెడ్డి జిల్లా జెడ్పీ ఛైర్మన్ పదవి ఈసారి ఎస్సీ మహిళకు రిజర్వ్ అయింది. చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య భార్య లేకుంటే కోడలును జడ్పీ ఛైర్మన్ బరిలో నిలబెట్టే అవకాశం ఉందట. యాదాద్రి భువనగిరి జడ్పీ పీఠం బీసీ మహిళకు రిజర్వ్ ?అయింది. ఇక్కడ కాంగ్రెస్ నుంచి ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్న భార్య బీర్ల శివాణి బరిలో ఉంటారనే ప్రచారం జరుగుతోంది.బీఆర్ఎస్ నుంచి ఆలేరు మాజీ ఎమ్మెల్యే భిక్షమయ్య గౌడ్ భార్య బూడిద సువర్ణ బరిలో ఉంటారని టాక్ నడుస్తోంది.

# జపాన్ తొలి మహిళా ప్రధానిగా తకైచి

న్యూఢిల్లీ,జపాన్‌కు తొలి మహిళా ప్రధానిగా తకైచి అరుదైన ఘనత సాధించనున్నారు.తాజా రాజకీయ పరిస్థితుల్లో ఆమె ఎన్నిక లాంఛనమే కానుంది. పార్టీలో అంతర్గత విభేదాల నేపథ్యంలో జపాన్ ప్రధానిగా ఉన్న షిగేరు ఇషిబా ఇటీవల తన పదవికి రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. ఈక్రమంలో అధికార లిబరల్ డెమొక్రటిక్ పార్టీ అధ్యక్షురాలిగా సనే తకైచి ఎన్నికయ్యారు. ఈక్రమంలో తదుపరి ప్రధానిగా తకైచి బాధ్యతలు తీసుకునేందుకు మార్గం సుగమమైంది. దీంతో జపాన్‌కు తొలి మహిళా ప్రధానిగా తకైచి అరుదైన ఘనత సాధించనున్నారు. ఇటీవల దేశంలో జరిగిన ఎన్నికల్లో పార్లమెంటు ఎగువ సభలో అధికార ఎల్‌డీపీ మెజార్టీని సాధించలేకపోయింది. దీనికి ముందు దిగువ సభలో కూడా మెజార్టీ కోల్పోయింది. దీంతో ఇషిబాపై ఒత్తిడి పెరగ్గా.. ఆయన తన పదవికి రాజీనామా చేశారు. ఈక్రమంలోనే శనివారం పార్టీలో ఎన్నికలు జరగ్గా.. మాజీ ప్రధాని కుమారుడు షింజిరో కోయిజుమితో పాటు మరో ముగ్గురు అభ్యర్థులను ఓడించి తకైచి విజయం సాధించారు. ఇక, దేశ తదుపరి ప్రధానిని ఎన్నుకునేందుకు జపాన్ పార్లమెంటు అక్టోబరు 15న ఓటింగ్ నిర్వహించనున్నట్లు ప్రముఖ వార్తా సంస్థ తెలిపింది. తాజాగా మాజీ ప్రధాని కుమారుడు షింజిరో కోయిజుమిని ఆమె ఓడించారు. 64 ఏళ్ల తకైచి 1993లో పార్లమెంటుకు ఎన్నికయ్యారు. ఎల్‌డీపీలో ఆర్థిక భద్రత, అంతర్గత వ్యవహారాలు, లింగ సమానత్వ మంత్రితో సహా పలు కీలక పదవుల్లో పనిచేశారు. ఈ గెలుపు తనకు సంతోషం ఇవ్వడం కంటే.. బాధ్యతను పెంచిందని ఈసందర్భంగా తకైచి పార్టీ సభ్యులతో పేర్కొన్నారు.

## ఈ ముగ్గురిలో ఎవరికి ఛాన్స్..

హైదరాబాద్,ఒకప్పుడు ఆ పార్టీ హైదరాబాద్ సెంట్రిక్‌గానే నడిచింది. రాష్ట్ర విభజన తర్వాత క్వార్టర్ ఓవర్ టు అమరావతి అయిపోయింది. అయినా ఇప్పుడు తెలంగాణలో క్యాడర్, లీడర్లు ఉండటంతో పాటు..మూడు నాలుగు జిల్లాల్లో పట్టున్న పార్టీ..పావులు కదుపుతోందట సైకిల్ పార్టీ. త్వరలో కొత్త అధ్యక్షుడిని నియమించి.. పూర్తి స్థాయి కార్యవర్గాన్ని ప్రకటించబోతున్నారట. తెలంగాణలో టీడీపీకి పూర్వ వైభవం తేవాలనే ప్లాన్‌లో ఉన్నారట చంద్రబాబు. స్థానిక ఎన్నికలతో పాటు GHMC ఎన్నికల్లో పోటీ చేసే యోచనలో టీడీపీ పార్టీ ఉన్నట్లు టాక్.తెలంగాణలో టీడీపీకి పూర్వ వైభవం తీసుకొచ్చే ప్రయత్నంలో ఉన్నారు టీడీపీ అధినేత, ఏపీ సీఎం చంద్రబాబు. కాసాని జ్ఞానేశ్వర్ రాజీనామా తర్వాత తెలంగాణ టీడీపీకి అధ్యక్షుడు లేకుండా పోయారు. దాదాపు రెండేళ్లుగా తెలంగాణలో పార్టీకి అధ్యక్షుడు లేరు. దీంతో పార్టీ ఏ కార్యక్రమాలను చేపట్టలేకపోతోంది. దీంతో అసలు రాష్ట్రంలో పార్టీ మనుగడలో ఉందా అన్న సందేహంతో టీడీపీలో ఉన్న నేతలు, క్యాడర్లు ఆందోళన చెందుతున్నారు. ఆలస్యం చేయకుండా తెలంగాణ టీడీపీకి అధ్యక్షుడిని నియమించాలని పార్టీ ముఖ్య నేతలు కొందరు చంద్రబాబుకు విజ్ఞప్తి చేసినట్లు తెలుస్తోంది. దీంతో తెలంగాణ నేతలతో ఇటీవల టెలికాన్ఫరెన్స్ నిర్వహించిన చంద్రబాబు...పార్టీ పరిస్థితిపై ఆరా తీసినట్లు సమాచారం. పార్టీని మెల్లమెల్లగా యాక్టివ్ మోడ్‌లోకి తీసుకురావాలని చంద్రబాబు డిసైడ్ అయినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అందులో భాగంగా తెలంగాణ టీడీపీ అధ్యక్షుడి నియామకం చేపట్టాలని ఆయన నిర్ణయించినట్లు తెలుస్తోంది. అంతే కాకుండా త్వరలోనే పూర్తిస్థాయిలో కార్యవర్గాన్ని ఏర్పాటు చేస్తానని తెలంగాణ టీడీపీ నేతలకు చంద్రబాబు హామీ ఇచ్చారట.

అధ్యక్ష పదవిని ఆశిస్తున్న ఆ ముగ్గురు..

ఈ క్రమంలో తెలంగాణ టీడీపీకి ఎవరిని అధ్యక్షుడిగా నియమించాలన్న దానిపై చంద్రబాబు సమాలోచనలు చేస్తున్నట్లు చెబుతున్నారు. ప్రస్తుతం టీటీడీపీలో కీలకంగా ఉన్న అరవింద్ కుమార్ గౌడ్‌తో పాటు పార్టీలో చేరబోతున్న తీగల కృష్ణా రెడ్డి, ఇటీవల పార్టీ సభ్యత్వం తీసుకున్న బాబు మోహన్ తెలంగాణ టీడీపీ అధ్యక్ష పదవిని ఆశిస్తున్నారట.ఆ మధ్య చంద్రబాబును కలిసిన బాబు మోహన్ తనకు తెలంగాణ అధ్యక్షుడిగా అవకాశం ఇవ్వాలని తన మనసులోని మాటను బయటపెట్టారట. ఇదే సమయంలో హైదరాబాద్ మాజీ మేయర్ తీగల కృష్ణారెడ్డి టీడీపీలో చేరాలని నిర్ణయించుకున్నారు. చాలా రోజుల క్రితమే హైదరాబాద్‌లో చంద్రబాబును కలిసిన తీగల..ఈ నెలలోనే అఫీషియల్‌గా సైకిల్ ఎక్కేందుకు రెడీ అవుతున్నారట. ఈ క్రమంలో తీగల కృష్ణారెడ్డి కూడా టీటీడీపీ అధ్యక్ష్య పదవిని ఆశిస్తున్నట్లు తెలుస్తోంది.

అధ్యక్షుడితో పాటు వర్కింగ్ ప్రెసిడెంట్ నియామకం..

ఇక ముందు నుంచి టీడీపీ పార్టీలో కీలకంగా ఉన్న పొలిట్ బ్యూరో సభ్యుడు అరవింద్ కుమార్ గౌడ్ పార్టీ అధ్యక్ష రేసులో ఉన్నారట. దీంతో ఎవరిని తెలంగాణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడిగా నియమించాలన్నదానిపై డైలమా కొనసాగుతున్నట్లు చెబుతున్నారు. టీడీపీకి అధ్యక్షుడితో పాటు వర్కింగ్ ప్రెసిడెంట్‌ను కూడా నియమించాలని చంద్రబాబు డిసైడ్ అయినట్లు తెలుస్తోంది. ఈ నెలాఖరులో హైదరాబాద్ రాబోతున్న చంద్రబాబు..ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్‌లో పార్టీ ముఖ్య నేతలతో సమావేశం ఏర్పాటు చేసి అందరితో చర్చించి పార్టీ అధ్యక్షుడు, వర్కింగ్ ప్రెసిడెంట్ నియామకంపై నిర్ణయం తీసుకోనున్నారని సమాచారం.స్థానిక సంస్థలు, ఆ తర్వాత జరిగే జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో పోటీ చేసి తెలంగాణలో టీడీపీ ఉనికిని చాటుకునే ప్రయత్నం చేయబోతోందట. ఇప్పటికీ తెలంగాణలో తమకున్న హార్డ్ కోర్ క్యాడర్‌లో జోష్ నింపి..ఇక్కడ పార్టీకి పూర్వవైభవం తేవాలనే లక్ష్యంతో చంద్రబాబు ముందుకు వెళ్తున్నారన్న చర్చ జరుగుతోంది.

## భాగ్‌సవారితో ముగిసిని బ్రహ్మోత్సవ వేడుక

తిరుమల,శ్రీ వేంకటేశ్వరస్వామివారికి తిరుమలలో బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా పూర్తయ్యాయి. ఈ క్రమంలో నిర్వహించే అనేకానేక ఉత్సవాలలో ఒకటైన భాగ్ సవారి ఉత్సవం శుక్రవారం సాయంత్రం అత్యంత వైభవంగా జరిగింది. శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు పూర్తి అయిన మరుసటిరోజు 'భాగ్‌సవారి' ఉత్సవం నిర్వహించడం ఆనవాయితీ. పురాణ ప్రాశస్త్యం నేపథ్యంలో స్వామివారి భక్తాగ్రేసరుడైన శ్రీఅనంతాళ్వారుల భక్తిని పరీక్షించడానికి శ్రీదేవి సమేతంగా స్వామివారు అనంతాళ్వారు పూదోటకు మానవ రూపంలో విచ్చేస్తారు. తన పూదోటలో పూలు కోస్తున్న అమ్మవారిని అనంతాళ్వారువారు అశ్వత్థ వృక్షానికి బంధిస్తాడు. అయితే స్వామివారిని పట్టుకోబోగా అప్రదక్షణ దిశలో పారిపోయి ఆలయంలో ప్రేవేశించి మాయమైపోతారు. అనంతరం అనంతాళ్వారులు తన భక్తిని పరీక్షించడానికి విచ్చేసినది సాక్షాత్తు స్వామివారేనని విషయం గ్రహించి పశ్చాత్తాపపడుతాడు. వెంటనే అమ్మవారిని బంధీనుండి విముక్తురాలుని చేసి, పూల బుట్టలో కూర్చోబెట్టి స్వయంగా స్వామివారి చెంతకు చేరవేస్తాడు. తన భక్తునియొక్క భక్తికి మెచ్చి స్వామివారు అతని కోరిక మేరకు బ్రహ్మోత్సవాల మరునాడు తాను అనంతాళ్వారుల తోటలోనికి అప్రదక్షణంగా విచ్చేసి తిరిగి ఆలయంలోనికి ప్రవేశిస్తానని అభయ మిచ్చాడు. ఈ నేపథ్యాన్ని పురస్కరించుకొని నిర్వహించే ఈ 'భాగ్‌సవారి' ఉత్సవం ఆద్యంతం ఆసక్తికరంగా సాగింది. స్వామివారు సాయంత్రం 4 గంటలకు వైభవోత్సవ మండపం నుండి బయలుదేరి అప్రదక్షిణంగా అనంతాళ్వారు తోటకు చేరి అక్కడ ప్రత్యేక పూజలందుకొని తిరిగి ఆలయంలోనికి ప్రవేశించడంతో ఈ కార్యక్రమం ఘనంగా ముగిసింది.

# కరూర్ లాంటి ఘటనలు ఆపలేమా ?



చెన్నై:దేశంలో రాజకీయ పార్టీల కార్యకలాపాలు నానాటికీ శృతి మించుతున్నాయి. ప్రజల ప్రాణాలంటే లెక్క లేకుండా పోయింది. ప్రజలను ఏమార్చడం, సెంటిమెంట్లను రెచ్చగొట్టడం, అధికారం సంపాదించడం అలవాటు చేసుకున్నారు. ఈ క్రమంలో రాజకీయ పార్టీల విన్యాసాలు ప్రజల ప్రాణాల మీదకు తెస్తున్నాయి. కరూర్ ఘటనపై మద్రాస్ హైకోర్టు సిట్‌ను వేసింది. దర్యాప్తు జరిపి నిజానిజాలు వెలికి తీసినా అందుకు కారకులైన ఆ పార్టీ వారిమీద ఎలాంటి చర్యలు ఉంటాయన్నది వేరుగా చెప్పాల్సిన అవసరం లేదు. గతంలో ఇలాంటి ఘటనలు చూశాం. ఎపిలో చంద్రబాబు హయాంలో గోదావరి పుష్కరాల సందర్భంగా పదుల సంఖ్యలో చనిపోయారు. జగన్ మొన్నటికి మొన్నర్యాలీలో ఒకరిద్దరు చనిపోయారు. రాజకీయ నేతల హత్యలుగా వీటిని పరిగణించి చర్యలు తీసుకుని ఉంటే కరూర్ ఘటన జరిగివుండేది కాదు. భారీగా బహిరంగ సభలు నిర్వహించడం, ర్యాలీలు చేపట్టడం వల్ల ప్రజల ప్రాణాలు పోతున్నాయి. అయినా ఆయా పార్ఈల నేతల్ల్లో కించిత్తు కూడా పశ్చాత్తాపం లేదు. తమిళనాడు కరూర్‌లో టివికె నాయకుడు, సినీ నటుడు విజయ్ సభలో చోటుచేసుకున్న మహా విషాదం మాటలకందనిది. నిర్వాహకుల భద్రతా లోపాలే తొక్కిసలాటగా మారి 41 మంది ప్రాణాలను బలిగొనడం ఏమాత్రం క్షంతవ్యం కాదు. ఇలాంటి ర్యాలీలు చేపట్టి ఏం ఉద్ధరిస్తారన్నది ప్రజలు కూడా ఆలోచించాలి. వీరంతా మన ఓట్లను కొల్లగొట్టే యంత్రాలని గుర్తించాలి. మనదగ్గర ఓటు ఆయుధం ఉ ందని గుర్తించి మసలుకోవాలి. నటుడు విజయ్‌ను చూడడానికి వచ్చిన 41మంది చనిపోతే ఆ కుటుంబాలు ఏం కావాలి. తీవ్రంగా గాయపడిన 80 మందిలో ఐదుగురి పరిస్థితి నేటికీ విషమంగానే ఉంది. ప్రాణాలు కోల్పోయిన, గాయపడిన వారంతా అణగారిన వర్గాలు, ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు చెందిన వారే. వారిని ఆదుకునేందుకు ఎలాంటి ప్రణాళిక ఉందో చెప్పడం లేదు. వారి కుటుంబాలకు భరోసా ఎవరు ఇస్తారో చెప్పడం లేదు. పోలీసులు ఇలాంటి ర్యాలీలకు అనుమతి ఇచ్చేముందు ఎందుకు ఆలోచించరన్నది కూడా ముఖ్యమే. హీరో విజయ్ వచ్చే ఏడాది జరగనున్న ఎన్నికల కోసం ఈ నెల 13 నుంచి రాష్ట్రవ్యాప్తంగా వీకెండ్ రోడ్ షోలు ప్రారంభించారు. విజయ్ ను చూసేందుకు అత్యధిక సంఖ్యలో సభలకు తరలివస్తున్నారు. వారికి తగిన భద్రత కల్పించడం, వారు ఇళ్లకు క్షేమంగా చేరుకునేలా ఏర్పాట్లు చేయడం నిర్వాహకుల బాధ్యత. అలాంటి బాధ్యతలను గాలికి వదిలేయడంతో తొక్కిసలాట ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. తమ పార్టీపై పోలీసులు ఆంక్షలు విధిస్తున్నారంటూ టివికె పార్టీ చేస్తున్న వాదనలో నిజం లేదు. ఎందుకంటే ఇలాంటి ర్యాలీలు నిర్వహించి ఏం చేస్తారన్నది చెప్పాలి. తగిన భద్రతా ప్రమాణాలు పాటించడం లేదని, ఆస్తుల విధ్వంసం చేస్తున్న వారిపై నిర్వాహకులకు నియంత్రణ ఉండటం లేదంటూ తమిళనాడు ప్రభుత్వం మద్రాసు హైకోర్టులో నాలుగు రోజుల క్రితమే వాదనలు వినిపించాయి. ఆస్తినష్టం జరగకుండా ముందస్తుగా సభల నిర్వాహకుల నుంచి డిపాజిట్లు వసూలు చేయాలంటూ హైకోర్టు ఆదేశించింది. బహిరంగ సభలు, ఊరేగింపులు తదితర సందర్భాల్లో మార్గదర్శకాలపై నివేదిక సమర్పించాలంటూ ధర్మాసనం ఆదేశించినా, సరైన జాగ్రత్తలు తీసుకోలేదనడానికి కరూర్ ఉదంతమే సాక్ష్యం. కరూరులో అభిమానులు రాత్రి 7.30 గంటలకు విజయ్ వచ్చేవరకూ ఎండలో, కనీసం తాగునీళ్లిచ్చే దిక్కులేక, ఆహారం లేక అలమటించాల్సి వచ్చింది. 10 వేల మంది సభకు వస్తారని నిర్వాహకులు అనుమతి తీసుకుని, 30 వేల మందికిపైనే మూడు జిల్లాల నుంచి సమీకరించారు. విజయ్ ను దగ్గర నుంచి చూడాలంటూ కొందరు అభిమానులు చెట్టు ఎక్కగా, ఆ చెట్టు కొమ్మ విరిగిపడటమే తొక్కిసలాటకు కారణమని చెబుతున్నారు. నీరసంగా ఉన్న అభిమానుల కోసం విజయ్ తన కాన్వాయ్ నుంచి నీళ్ల సీసాలు విసరడం, కొందరు అత్యుత్సాహంతో కాన్వాయ్ వద్దకు తోసుకెళ్లడమూ గందరగోళానికి కారణమైందంటున్నారు. భారీ సంఖ్యలో అభిమానులు చేరుకోవడం, నిర్వాహకులు, స్థానిక అధికారుల మధ్య గందరగోళం, నిర్వహణాలోపమే ఘటనకు ప్రధాన కారణం. వెనువెంటనే సంఘటనా స్థలానికి సిఎం వచ్చి, పరామర్శించడం, ప్రభుత్వ యంత్రాంగాన్ని పరుగులు పెట్టించడం, మృతదేహాలకు వెంటనే పోస్టుమార్టం నిర్వహించి కుటుంబాలకు అందించడం, నష్టపరిహారం ప్రకటించడం ఉపశమనం కలిగించేవే! రాష్ట్రప్రభుత్వం ఏర్పాటుచేసిన జస్టిస్ అరుణా జగదీశన్ నేతృత్వంలోని ఏకసభ్య కమిషన్ ఇప్పటికే క్షేత్రస్థాయిలో పర్యటిస్తోంది. పరిహారం ప్రకటించిన విజయ్ బాధిత కుటుంబాలను పరామర్శించ కుండా వెనుదిరగడమూ చర్చనీయాంశమైంది. దీనిని మద్రాస్ హైకోర్టు కూడా తప్పు పట్టింది. ఇక వారే సిబిఐ విచారణ కోరడం మరీ దారుణం. ఆయన కానీ, వారి పార్టీ నాయకులు గానీ క్షతగాత్రులకు వైద్యమందించిన ఆసుపత్రులకైనా వెళ్లకపోవడం శోచనీయం. రాజకీయ సభలైనా, మతపరమైనవైనా, ఏ కార్యక్రమమైనా? అక్కడికి వచ్చే ప్రజల ప్రాణాలను కాపాడి, క్షేమంగా ఇళ్లకు చేర్చాల్సిన బాధ్యత నిర్వాహకులదే. ఇరుకుగా ఉండే ప్రదేశాలను జనాకర్షణ కలిగిన నేతల భారీ సభల కోసం, రోడ్‌షోల కోసం వినియోగించకుండా, విశాల ప్రదేశాల్లోనే సభలు నిర్వహించేలా చూడటం అవసరం. పదుల సంఖ్యలో అమాయక ప్రజల మరణానికి కారణమైన ఇటువంటి తొక్కిసలాట ఘటనల సందర్భంగా జరిగిన నిర్వహణ వైఫల్యాలు, పాలనా యంత్రాంగం లోపాలు వంటివి సమీక్షించి, తగు చర్యలు తీసుకోవడం ద్వారా ఇలాంటి దుర్ఘటనలు పునరావృతం కాకుండా చూడాలి. మద్రాస్ హైకోర్టు సూచనల మేరకు ఇలాంటి ర్యాలీలపై నిషేధం విధించాలి. అప్పుడే కొంతవరకైనా మేలు కలుగుతుంది. జనాలు కూడా వేలం వెర్రిలాగా ర్యాలీలకు, సభలకు వెళ్లకుండా ఉండడం కూడా మంచిది.

## గాజాలో శాంతి ప్రక్రియకు ముందడుగు

న్యూఢిల్లీ, ఇజ్రాయెల్- హమాస్‌ల మధ్య సుదీర్ఘకాలంగా కొనసాగుతున్న యుద్ధం ముగింపునకు కీలక ముందడుగు పడింది. గాజాలో శాంతి నెలకొల్పేందుకు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రతిపాదించిన 20 సూత్రాల ఫార్ములాను హమాస్ అంగీకరించింది. ఈ తాజా పరిణామాలను భారత్ స్వాగతించింది. గాజాలో శాంతి ప్రయత్నాలకు ట్రంప్ నాయకత్వాన్ని ప్రధాని మోదీ అభినందించారు. గాజాలో శాంతి ప్రయత్నాల్లో నిర్ణయాత్మక పురోగతి సాధించిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్ నాయకత్వాన్ని స్వాగతిస్తున్నట్లు మోదీ ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. బందీల విడుదలకు అంగీకారం కుదరడం శాంతిస్థాపన కు కీలక

# ఆర్టీసీ కార్గో ప్రైవేటు పరం!..

హైదరాబాద్,'పాలిచ్చే బర్రెను వదిలేసి.. తన్నే దున్నపోతును తెచ్చుకున్నట్టు' ఉ ంది ఆర్టీసీ యాజమాన్యం పరిస్థితి. ఏటా సుమారు రూ.100 కోట్ల పైగా రాబడి తెచ్చిపెట్టే కార్గోను సొంతంగా నిర్వహించుకోవాల్సింది పోయి. కేవలం నెలకు రూ.3 కోట్లు చెల్లించే ప్రైవేట్ సంస్థకు అప్పనంగా అప్పగించడం ఇందుకు నిదర్శనంగా నిలుస్తున్నది. దీంతో 10 నుంచి 15 ఏండ్ల పాటు ఆర్టీసీ కార్గో సేవలు ప్రైవేట్ సంస్థ ఆధీనంలోనే ఉంటాయి. ఈ టెండర్లకు సంబంధించి కొన్ని ఎంపిక చేసిన పత్రికల్లో మాత్రమే ఎక్కడో ఓ మూలన టెండర్ ప్రకటన ఇచ్చి.. అత్యంత రహస్యంగా ఆర్టీసీ ఈ ప్రక్రియను ముగించింది. కేసీఆర్ ప్రభుత్వం ప్రారంభించిన ఈ అద్భుతమైన కార్గో సేవల ద్వారా ఏటా ఆర్టీసీకి భారీగా లాభాలు వచ్చాయి. 2020లో ప్రారంభమైన ఆర్టీసీ కార్గో సేవలు తక్కువ కాలంలోనే ప్రజాదరణ పొందాయి. దీంతో ప్రజలకు తక్కువ ధరల్లోనే నమ్మకమైన సరుకు రవాణా కార్యకలపాలు సాగిస్తూ.. ఆర్టీసీకి లాభాల్లో తనవంతు భాగస్వామ్యాన్ని అందించింది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఆర్టీసీకి సుమారు రూ.100 కోట్ల రాబడి వచ్చినట్లు విశ్వసనీయంగా తెలిసింది. అటువంటి సంస్థను నిర్వహించడంపై దృష్టి పెట్టకుండా ప్రభుత్వ పెద్దల సూచన మేరకు ఆర్టీసీ కార్గో సేవలను ప్రైవేట్ ఏజెన్సీకి అప్పగించింది. దీంతో ఇప్పటికే ఆర్టీసీ నుంచి ప్రైవేట్ పరం అయిన సంస్థల్లో కార్గో కూడా చేరింది.

అడ్డగోలుగా ఆర్టీసీ సాకులు

డ్రైవర్లు, కండక్టర్ల వేతనాలు, డీజిల్, ఇతర ఖర్చులను సాకుగా చూపి ఏటా రూ.100 కోట్ల వరకూ రాబడి వచ్చే కార్గో సేవలను నెలకు కేవలం రూ.3 కోట్ల చెల్లింపు ఒప్పందంతోనే ఆర్టీసీ సంస్థ ప్రైవేట్‌పరం చేసింది. కార్గో సేవలను నిర్వహించడం భారంగా మారడంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్టు యాజమాన్యం సాకులు చెప్తున్నది. ఆర్టీసీకి చెందిన డ్రైవర్లు, కండక్టర్లు కార్గో సర్వీసులలో విధులు నిర్వహించేందుకు ఏమాత్రం ఆసక్తి కనబర్చడంలేదని అధికారులు పేర్కొంటున్నారు. అయితే, ఇటీవల ఆర్టీసీ సంస్థలో భారీగా ఉద్యోగ విరమణలు జరిగాయి. కానీ, కొత్తగా సిబ్బందిని నియమించుకోవడంలో ప్రభుత్వం, ఆర్టీసీ సంస్థ మీనమేషాలు లెక్కిస్తున్నదని పలువురు ఆరోపిస్తున్నారు. దీనికి తోడు కార్గో సేవలు నిర్వహించే వారిపట్ల డీఎంలు, ఆర్ఎంల వేధింపులు దారుణంగా ఉంటున్నాయని సమాచారం. ఈ క్రమంలో కొత్తగా నియామకాలు చేపట్టి, ఉ న్న వ్యవస్థను అద్భుతంగా తీర్చిదిద్దుకోవల్సిన ఆర్టీసీ.. ప్రైవేట్‌కు ఇచ్చేందుకు మొగ్గుచూపడం సిబ్బందిని సైతం తీవ్ర ఆశ్చర్యానికి గురిచేసింది. ఏడాదికి వచ్చే రూ.100 కోట్ల రాబడి ఎక్కడ? ప్రైవేట్ ఏజెన్సీ ఇచ్చే రూ.36 కోట్లు ఎక్కడ? అని ప్రశ్నిస్తున్నారు. ఖర్చు తగ్గించుకోవాల్సిన చోట తగ్గించుకోకుండా.. ఉన్న సంస్థలన్నీ ఇలా ప్రైవేట్ పరం చేయడం ఏంటని కార్మిక సంఘాల నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సంస్థతీరుపై మండిపడుతున్నారు.

కార్గో సేవలను దక్కించుకున్న అవేజీ సంస్థ

గతంలో కొన్ని చిన్న బస్టాప్‌లలో మాత్రమే సేవలందించేందుకు ప్రైవేట్ ఏజెన్సీలను ఆహ్వానించారు. ప్రస్తుతం ఆర్టీసీకి సంబంధించిన కార్గో సేవలన్నింటిని నిర్వహించుకునేందుకు 'మాస్టర్ ఏజెన్సీ'ని ప్రభుత్వ సూచన మేరకు ఆర్టీసీ ఆహ్వానించింది. ఈ మేరకు గత ఆగస్టులో టెండర్ నోటిఫికేషన్ (నం: %జ2/644(1)/2025-BH) విడుదల చేసింది. దరఖాస్తుదారుకు గత 3 ఆర్థిక సంవత్సరాలలో (2022-23, 2023-24, 2024-25) సగటు వార్షిక టర్నోవర్ రూ.200 కోట్ల కంటే ఎకువ ఉండాలి. నికర విలువ 31.03.2025



నాటికి కనీసం రూ.100 కోట్లు వరకు ఉండాలనే నిబంధనతో ఈ టెండర్లు పిలిచారు. దీంతో ఆన్‌లైన్ వేలంలో పలు సంస్థలు పాల్గొనగా 'అవేజీ ప్రైవేట్ లిమిటెడ్' ఈ టెండర్‌ను దక్కించుకున్నట్టు తెలిసింది. ఆర్టీసీ పెట్టిన నిబంధనల ప్రకారం నెలకు రూ.3 కోట్లు ఆర్టీసీకి చెల్లించేందుకు ఈ సంస్థ ఒప్పుకోవడంతో ఆర్టీసీ కార్గో సేవలకు సంబంధించిన కాంట్రాక్టును 10 సంవత్సరాలపాటు నిర్వహించుకునేందుకు అప్పగించారు. ఇరు సంస్థల మధ్య సంతృప్తికరమైన పనితీరు ఉంటే దానిని మరో 5 ఏండ్లపాటు పొడిగించుకునే అవకాశం ఉ ందని పేర్కొన్నారు. టెండర్ ప్రక్రియ ద్వారా ఎంపికైన అవేజీ ఏజెన్సీ.. టీజీఎస్‌ఆర్టీసీ బస్సుల ద్వారా పార్సిల్, కొరియర్, కార్గో సేవలను కో-బ్రాండింగ్‌తో కలిపి నిర్వహిస్తుంది. నెలకు ఇచ్చే రూ.3 కోట్లలో రూ.2.80 కోట్లు లైసెన్స్ ఫీజు కాగా, రూ.20 లక్షలు అద్దె కింద పరిగణిస్తారు.

కార్గో ప్రైవేట్‌పరం- ముఖ్యాంశాలు

-మాస్టర్ ఏజెన్సీ కార్గో సేవలను తెలంగాణతోపాటు, టీజీఎస్‌ఆర్టీసీ బస్సులు నడుస్తున్న ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్రలో కూడా సేవలు అందించాలి.

- టీజీఎస్‌ఆర్టీసీ ప్రాంగణాలలోని అన్ని కార్గో పార్సిల్ కౌంటర్లను మాస్టర్ ఏజెన్సీ నిర్వహించాలి.

- తెలంగాణ, అంతర్‌రాష్ట్ర ప్రాంతాలలో అవసరమైన ప్రదేశాలలో కొత్త కౌంటర్లను ఏర్పాటు చేయవచ్చు.

-మాస్టర్ ఏజెన్సీ కౌంటర్లలో పనిచేసే సిబ్బందికి అయ్యే ఖర్చులను ఏజెన్సీయే భరించాలి.

-అన్ని బస్ స్టేషన్లు, ఆర్టీసీ ప్రాంగణాలలో ఉన్న కౌంటర్ల అద్దె ఖర్చులను మాస్టర్ ఏజెన్సీ భరించాలి. లైసెన్స్ ఫీజులో ఇది నెలకు రూ.20 లక్షల వరకు ఉ ంటుంది.

-మందుగుండు సామగ్రి, ఆలహాల్, డ్రగ్స్, పేలుడు పదార్థాలు, జంతువుల చర్మాలు, ఆయుధాలు వంటి 50కి పైగా నిషేధిత వస్తువులను రవాణా చేయకూడదు.

-బిడ్డర్ అభ్యర్థన మేరకు లైసెన్స్ ఫీజు పెంపుదలను 10 నుంచి 5 శాతానికి తగ్గించాలని ప్రీ-బిడ్ సమావేశం నిర్ణయించింది.

- క్లెయిమ్ చేయని పార్సిళ్ల పారవేత బాధ్యత మాస్టర్ ఏజెన్సీకే అప్పగించాలి.

- మాస్టర్ ఏజెన్సీని ప్రారంభించడానికి గడువును 15 రోజుల నుంచి 30 రోజులకు పెంచడానికి అంగీకరించారు.

-పీసీసీ ఏజెంట్ల ప్రయోజనాలను కాపాడటానికి వారికి సంబంధించిన సెక్యూరిటీ డిపాజిట్‌ను ఒప్పందం ముగిసే వరకు టీజీఎస్‌ఆర్టీసీ వద్దనే ఉంటుంది.

## అభిమానికి మంత్రి లోకేశ్ షాక్

విజయవాడ, తమ పెళ్లికి రావాలని ఓ మహిళా అభిమాని పంపిన ఆహ్వానాన్ని మంత్రి లోకేష్ మన్నించారు .. గతంలో చేపట్టిన యువగళం పాదయాత్రలో భాగంగా 2023 ఆగస్టు 20వ తేదీన యువనేత నారా లోకేష్ విజయవాడలో పాదయాత్ర నిర్వహించారు? విజయవాడ మొగల్రాజపురానికి చెందిన భవానీ అనే యువతి ఆనాటి పాదయాత్రలో ఉత్సాహంగా పాల్గొన్నారు.. యువగళం యాత్ర ద్వారా లోకేష్ అభిమానిగా మారిన భవ్య.. తన పెళ్లికి విచ్చేసి ఆశీర్వదించాలంటూ ఇటీవల మంత్రి నారా లోకేష్ కు ఆహ్వానపత్రిక పంపించారు. శనివారం రాత్రి గన్నవరం ఎయిర్ పోర్టు సమీపంలోని ఓ కళ్యాణ మండపంలో భవ్య వివాహం జరగనుంది. బిజీ షెడ్యూలు ఉన్నప్పటికీ మంత్రి లోకేష్ శనివారం మధ్యాహ్నం మొగల్రాజపురంలోని తన అభిమాని భవ్య ఇంటికి వెళ్లి ఆమెకు ఆశీర్వచనాలు అందజేశారు. అకస్మాత్తుగా అభిమాన నేత లోకేష్ తమ ఇంటికి రావడంతో భవ్యతోపాటు ఆమె తల్లిదండ్రులు నాగుమోతు రాజా, లక్ష్మి ఆనందంతో పొంగిపోయారు. యువనేత లోకేష్ ను చూసి వారి ఉద్వేగానికి గురయ్యారు.

# జగన్ దెబ్బకు దిగొచ్చిన చంద్రబాబు

అమరావతి, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి లోకేష్‌పై మాజీ మంత్రి పేర్ని నాని ఫైర్ అయ్యారు.. తాజాగా ఆయన మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు, పవన్, లోకేష్ ముగ్గురూ కలిసి మూడు ఖాకీ చొక్కాలేశారన్నారు. ఆటో డ్రైవర్ సేవలో పేరుతో డ్రైవర్లకు డబ్బులేశామని చెబుతున్నారన్నారు. ఎన్నికల్లో రాష్ట్రమంతా మహిళలకు బస్సు ప్రయాణం ఫ్రీ అన్నారని చెప్పారు. ఎవరైనా అడిగితే నా పేరు చెప్పాడని చంద్రబాబు తెలిపారు. ఎవరైనా ప్రశిస్తే తోలు తీస్తామన్నారని గుర్తు చేశారు. ఏడాదైనా ఫ్రీ బస్సు ఇవ్వకపోవడంతో విమర్శల పాలయ్యారన్నారు. జగన్ మోహన్ రెడ్డి , ప్రజలు, ప్రతిపక్షాల దెబ్బకు చంద్రబాబు ప్రభుత్వం దిగొచ్చిందని చెప్పారు. ఫ్రీ బస్సులో జిల్లాల సరిహద్దులు దాటడానికి వీల్లేదని సాక్షాత్తూ మంత్రులే చెప్పారన్నారు. తీవ్ర వ్యతిరేకత రావడంతో పల్లె వెలుగులో రాష్ట్రమంతా తిరగొచ్చని ప్రకటించారని ప్రకటించారు. బస్సులను తగ్గించేశారని చెప్పారు. చంద్రబాబు దెబ్బకు ఆటోవాళ్లంతా రోడ్డెక్కారని మాజీ మంత్రి పేర్ని నాని అన్నారు. 'ఎన్నికల్లో ఊకదంపుడు ప్రసంగం చేసిన చంద్రబాబు, పవన్ ను నిలదీశారు. 2,90,669 మంది ఆటో డ్రైవర్లకు 436 కోట్లు వేశామని చంద్రబాబు చెబుతున్నారు. భూ ప్రపంచం మీద తనే ఆటో డ్రైవర్లను ఆదుకున్నానని బిల్డప్ ఇచ్చారు. చంద్రబాబు స్పీచ్ దెబ్బకు ఆటో డ్రైవర్లకు చెవుల వెంట రక్తం ఒక్కటే తక్కువ. ఆటో వాళ్ల కోసం యాప్ పెడతా.. కంట్రోల్ రూమ్ పెడతానంటున్నారు. ఆటో, క్యాబ్, మ్యాక్సీక్యాబ్ డ్రైవర్లకు పండగే పండగ అని చంద్రబాబు చెబుతున్నారు. చంద్రబాబు తీరు సినిమాలో బ్రహ్మానందం క్యామెడీ సీన్ లా ఉంది. వాహన మిత్ర పథకం ప్రారంభించింది జగన్ మోహన్ రెడ్డి. పాదయాత్రలో జగన్ మోహన్ రెడ్డి ఆటో డ్రైవర్ల కష్టాలు తెలుసుకున్నారు. మచిలీపట్నంలో ఆటో డ్రైవర్ల సమస్యలు స్వయంగా విన్నారు. తమకు ఏడాదికి పది వేలైనా ఇవ్వమని ఆటో డ్రైవర్లు అడిగారు. సొంతంగా ఆటో కొనుక్కుని నడుపుకుంటున్న వారికి 10 వేలు ఇస్తామని ఏలూరు వేదికగా ప్రకటించారు. జగన్ సీఎం అయిన వెంటనే.. 2 లక్షల 36 వేల మందికి వాహనమిత్ర ఇచ్చారు. ఎన్నికల సంవత్సరం కూడా జగన్ మోహన్ రెడ్డి 2 లక్షల 75 వేల మందికి వాహన మిత్ర ఇచ్చారు. ఇప్పుడు జగన్ కంటే చంద్రబాబు కేవలం 14 వేల మందికి మాత్రమే అదనంగా ఇచ్చారు.' అని పేర్ని నాని వ్యాఖ్యానించారు.

## ప్రయాణికులకు ఆర్టీసీ షాక్

హైదరాబాద్,టీజీఎస్‌ఆర్టీసీ ప్రయాణికులకు షాక్ ఇచ్చింది. సిటీ బస్సుల్లో ఛార్జీలు పెంచుతున్నట్లు ప్రకటించింది. హైదరాబాద్, సికింద్రాబాద్ పరిధిలో నడిచే అన్ని బస్సుల్లో ఛార్జీలు పెంచుతున్నట్లు పేర్కొంది. సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్, ఈ-ఆర్డినరీ, ఈ-ఎక్స్ ప్రెస్, మెట్రో డీలక్స్, ఈ-మెట్రో, ఏసీ సర్వీసుల్లో ఛార్జీల పెంచుతున్నట్లు చెప్పింది. మొదటి మూడు స్టేజిలకు రూ.5, 4వ స్టేజి నుంచి రూ.10 అదనపు ఛార్జీల వసూలు చేయనున్నట్లు సమాచారం. మెట్రో డీలక్స్, ఈ-మెట్రో ఏసీ సర్వీసుల్లో మొదటి స్టేజీకి రూ.5, రెండో స్టేజీ నుంచి రూ.10 అదనపు ఛార్జీలు వసూలు చేయనుంది. అయితే.. పెరిగిన ఛార్జీలు సోమవారం నుంచి అమల్లోకి రానున్నాయి. తాజాగా ఛార్జీల పెంపుపై టీజీఎస్‌ఆర్టీసీ స్పందించింది. ఆర్థిక భారాన్ని మోయలేకపోతున్నామని తేల్చి చెప్పింది. సిటీ బస్సుల్లో మెరుగైన వసతులు కల్పించాలంటే ఛార్జీలు పెంచక తప్పట్లేదు అని వివరించింది. పెరిగిన ఛార్జీలు సోమవారం నుంచి అమల్లోకి రానున్నట్లు ప్రకటించింది. సిటీ బస్సుల్లో పెరిగిన ఛార్జీలపై నగరవాసులు సహకరించాలని టీజీఎస్‌ఆర్టీసీ విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు తాజాగా ఓ ప్రకటన విడుదల చేసింది. ఈ ప్రకటనలోని వివరాల ప్రకారం.. టీజీఎస్‌ఆర్టీసీ ఇప్పుడున్న పరిస్థితుల్లో ఈ ఆర్థిక భారాన్ని మోయలేదు. ప్రభుత్వం, ప్రజల సహకారంతో ఈ వ్యవస్థను ముందుకు తీసుకెళ్లాలని కోరుకుంటోంది. ఈ నేపథ్యంలోనే ఎలక్ట్రిక్ బస్సుల మౌలిక సదుపాయాల వ్యయాన్ని సమకూర్చుకునేందుకు సిటీ బస్సుల్లో అదనపు ఛార్జీని విధించేందుకు అనుమతి ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వానికి టీజీఎస్‌ఆర్టీసీ యాజమాన్యం ప్రతిపాదించింది. ఈ ప్రతిపాదనను సెప్టెంబర్ 23న రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించింది. హైదరాబాద్, సికింద్రాబాద్ పరిధిలో నడిచే అన్ని బస్సుల్లో అదనపు ఛార్జీని సంస్థ వసూలు చేయనుంది. హైదరాబాద్ భవిష్యత్ బాగు కోసం వాడకంలోకి తీసుకువస్తోన్న ఎలక్ట్రిక్ బస్సులను ప్రజలు ఆదరించాలని, నగర ప్రజా రవాణా ముఖచిత్రాన్ని పూర్తిగా మార్చబోతున్న ఈ గ్రీన్ జర్నీలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలని సంస్థ కోరుతోంది. ఈ పర్యావరణహిత కార్యక్రమానికి సహకరించి.. గతంలో మాదిరిగానే ఆర్టీసీ సేవలను ప్రోత్సహించాలని విజ్ఞప్తి చేస్తోంది. రాబోయే 2800 కొత్త ఎలక్ట్రిక్ బస్సుల కోసం 19 డిపోల్లో ఛార్జింగ్ కోసం హెచ్‌టీ కనెక్షన్లను సంస్థ ఏర్పాటు చేయనుంది. అలాగే, ఎలక్ట్రిక్ బస్సుల ద్వారా హైదరాబాద్ లో ప్రజా రవాణాను మరింతగా విస్తరించేందుకు కొత్తగా 10 డిపోలను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. అలాగే, కొత్తగా 10 ఛార్జింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయనుంది. ఈ మౌలిక సదుపాయాలకు రానున్న సంవత్సరంలో రూ.392 కోట్ల మేర వ్యయమవుతుందని టీజీఎస్‌ఆర్టీసీ అధికారులు అంచనా వేశారు.

### కొత్త మద్యం దుకాణాలకు టెండర్లు

హైదరాబాద్,డిసెంబర్ 1 నుండి తెలంగాణలో ప్రారంభం కానున్న నూతన మద్యం దుకాణాల కోసం రాష్ట్ర ఎక్సైజ్ శాఖ తాజాగా నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నూతన దుకాణాలకు సంబంధించిన దరఖాస్తులు సెప్టెంబర్ 26 నుంచి స్వీకరిస్తున్నారు. ఇప్పటికే శనివారం వరకు రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 447 దరఖాస్తులు నమోదు అయ్యాయని ఎక్సైజ్ శాఖ అధికారులు తెలిపారు. సోమవారం నుండి దరఖాస్తుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని సమాచారం ఉంది. మేడ్చల్ యూనిట్ పరిధిలో ఉన్న 118 కొత్త మద్యం దుకాణాల కోసం ఇప్పటివరకు 20 దరఖాస్తులు వచ్చాయని అధికారులు పేర్కొన్నారు. మొత్తం దరఖాస్తుల స్వీకరణ అక్టోబర్ 18 వరకు కొనసాగుతుంది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 2,620 మద్యం దుకాణాలకు నిర్వాహకులను ఎంపిక చేసుకోవడం కోసం అక్టోబర్ 23న లాటరీ ప్రక్రియ నిర్వహించనున్నారు.

# బాలక్రిష్ణ ని టార్గెట్ చేసిన పచ్చ చానల్ !



అమరావతి,నందమూరి బాలక్రిష్ణ. ప్రముఖ టాలీవుడ్ నటుడు. అంతే కాదు తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే. ఇక బాలయ్య తన వ్యాఖ్యల ద్వారా తరచూ వివాదాలు కోరి తెచ్చుకుంటారు అని చెబుతూంటారు. తాజాగా ఆయన అసెంబ్లీలో చేసిన కొన్ని అనుచిత వ్యాఖ్యలు ఇంకా రాజకీయ రచ్చగానే ఉంటున్నాయి. దానికి కారణం మీడియాలో దాని మీద పదే పదే విశ్లేషణలు రావడమే. అంతే కాదు సోషల్ మీడియాలోనూ ఇష్యూ చేస్తున్నారు. ఇదిలా ఉంటే బాలయ్యకు ఒక ప్రముఖ తెలుగు మీడియా చానల్ అధిపతికి పడదని ప్రచారంలో ఉన్న మాట. ఆయన వార్తలు కానీ ఆయన గురించిన సమాచారం కానీ తమ చానల్ తమ పత్రికలో ఎక్కడా రాకుండా అనధికార నిషేధం విధించిన సందర్భాలు ఉన్నాయని చెబుతారు. అయితే ఇపుడు బాలయ్యను నేరుగా టార్గెట్ చేస్తూ ఒక టీడీపీ అనుకూల మీడియా రాజకీయ విశ్లేషణ చేయడం ఆసక్తిని రేపుతోంది.

బాలయ్యని ఎండగడుతూ :

నిజానికి బాలయ్య అసెంబ్లీలో చేసిన దానిని ఎవరూ సమర్ధించే సమస్య లేదు. అదే సమయంలో ఈ ఘటన జరిగి కూడా రోజులు చాలా గడచిపోయాయి. అయినా సరే ఇపుడు మానిన గాయానికి పుండుని మెల్లగా కెలికినట్లుగా కెలకడం వెనక ఏమి ఆంతర్యం ఉందో తెలియదు కానీ బాలయ్య మా చెడ్డవాడు ఆయన బావయ్య చంద్రబాబుని ఆయన ఇబ్బంది పెడుతున్నారు అంటూ తనదైన విశ్లేషణను వండి వార్చింది. బాలయ్యను పూర్తిగా తూర్పరా పట్టేసింది. పనిలో పైగా సీనియర్ ఎన్టీఆర్ ని కూడా ముగ్గులోకి లాగి ఇప్పటికి మూడున్నర దశాబ్దాల క్రితం ఉమ్మడి ఏపీలో ఆయన ఒక మహిళా కాంగ్రెస్ ఎమ్మెల్యే విషయంలో అనుచిత భాషను వాడారని ఈ తరానికి తెలియని విషయం చెప్పి మరీ విశ్లేషించడం విశేషం.

సభా మర్యాదలు తెలియవా :

బాలయ్య మూడు సార్లు ఎమ్మెల్యేగా ఉన్నారు. ఆయనకు సభా మర్యాదలు తెలియవా అని సదరు చానల్ వార్తా విశ్లేషణలో ప్రశ్నించింది. చలువ కళ్ళద్దాలు నెత్తిన పెట్టుకుని రెండు జేబులలో చేతులు పెట్టుకుని తన బాడీ లాంగ్వేజ్ తో బాలయ్య అసెంబ్లీలో మర్యాదలను మంటగలిపారు అని విమర్శించింది. ఇంత జరిగినా సభా స్థానంలో ఉన్న వారు చూస్తూ ఊరుకుండిపోయారు అని నిందించింది.

జగన్ ని అనడం తప్పు :

ఇక బాలయ్య జగన్ ని సైకో గాడు అనడం తప్పు అంటూ సదరు చానల్ విశ్లేషించిన తీరు కాసింత ఆసక్తికరమే. ఎందుకంటే నిత్యం జగన్ మీద తీవ్ర స్థాయిలో విరుచుకుపడే చానల్ జగన్ ని వెనకేసుకుని వస్తూ బాలయ్యను పూర్తిగా తప్పు పట్టింది. సభలో లేని వారి మీద సాటి సభ్యుడి మీద ఈ రకంగా మాట్లాడుతారా అని ఎత్తి పొడిచింది. అంతే కాదు బాలయ్య ఇంట్లో అప్పట్లో కాల్పుల సంఘటన జరిగితే ఆయనను కేసుల నుంచి కాపాడింది వైఎస్సార్ అని పాత విషయాలు గుర్తు చేసింది. ఇక బాలయ్యకు జగన్ వీరాభిమాని అని గతాన్ని గుర్తు చేసింది. ఇంతలా జగన్ వైఎస్సార్ నుంచి బాలయ్యకు అనుకూలత ఉంటే బాలయ్యకు ఇవన్నీ గుర్తుకు ఉన్నాయా అని దారుణంగా విమర్శించింది.

తెర మీదనే హీరోలంటూ :

సినిమా హీరోలు తమను తాము డెమ్మీ గాడ్స్ గా భావిస్తూ ఆ భ్రమలలో ఉండిపోతున్నారు అని దెప్పిపొడిచింది. వారు తెర మీద మాత్రమే హీరోలని కూడా పేర్కొంది. అన్ని కులాలు మతాలు మద్దతు ఉంటే ఎవరైనా హీరోగా రాణించేది అని ఒక కులం అభిమానం కోసం వారిని దగ్గర తీయడం తగదని ఇండైరెక్ట్ గా కూడా చురకలు అంటించింది. టీడీపీ లేకపోతే బాలయ్య అయినా ఒంటరిగా గెలిచే సమస్య లేదని తేల్చేసింది. బాలయ్య చేస్తున్న తప్పుల వల్ల కూటమిలో చిచ్చు రాజుకుంటోందని కూడా పేర్కొంది.

బాబుకు చెలగాటం :

తన బావమరిది బాలయ్య చేసిన అనుచిత వ్యాఖ్యల కారణంగానే చంద్రబాబు పవన్ కళ్యాణ్ ఇంటికి స్వయంగా వెళ్ళి జ్వరం పేరు మీద పరామర్శించాల్సి వచ్చిందని సదరు చానల్ పేర్కొనడం విశేషం. గంటకు పైగా బాబు పవన్ ఇంట్లో ఉండి మాట్లాడడం వెనక ఇదే కారణం అని అన్యాపదేశంగా చెప్పుకొచ్చింది. అంతే కాదు చిరంజీవితో కూడా చంద్రబాబు ఫోన్ ద్వారా సంభాషించారని కొత్త విషయం చెప్పుకొచ్చింది. కూటమి కోసం ఐక్యత కోసం చంద్రబాబు ఎంతో పాటు పడుతున్నారని ఢిల్లీలో కూడా నరేంద్ర మోడీకి అన్ని విధాలుగా సహకరిస్తూ రాష్ట్రాభివృద్ధి కోసం పనిచేస్తున్నారు అని పేర్కొంది. ఇంతలా చంద్రబాబు కష్టపడుతూంటే బాలయ్య వంటి వారు మాత్రం బిగ్ ట్రబుల్స్ క్రియేట్ చేస్తున్నారు అని ఘాటైన వ్యాఖ్యలే చేసింది.

బాలయ్యదే తప్పంటూ :

మొత్తానికి తేల్చింది ఏంటి అంటే బాలయ్య చేస్తున్న తప్పులు ఆయన సందర్భ శుద్ధి లేకుండా వ్యవహరించడం వల్లనే కూటమి ఇబ్బందులలో పడుతోంది అని. అంతే కాదు ఇది బయట కాచుకుని కూర్చున్న వైసీపీకి అవకాశాన్ని ఇవ్వడమే అని అంటోంది సినిమా సభలలో మాట్లాడితే అది బాలయ్యకు మాత్రమే నష్టం అని కానీ అసెంబ్లీలో ఆయన చేసిన కామెంట్స్ మాత్రం కూటమికి సభకు కూడా నష్టమని అంటోంది. బాలయ్య మీద చర్యలు తీసుకోవాల్సిందే అన్నట్లుగా రాసుకొచ్చింది. మరి బాలయ్యను ఇంతలా టార్గెట్ చేయడానికి కారణం అసెంబ్లీలో ఆయన చేసిన అనుచిత వ్యాఖ్యలేనా ఇంకా ఏమైనా అన్నది కూడా చర్చగా ఉంది. మరో వైపు చూస్తే టీడీపీకి చెందిన వారి విషయంలో ఎపుడూ పెద్దగా తప్పులు వెతకని సదరు పచ్చ చానల్ బాలయ్యను టార్గెట్ చేయడం కోసం ఏకంగా జగన్ ని సైతం వెనకేసుకుని వచ్చిన తీరు వైఎస్సార్ ఉదారతను కూడా ప్రస్తావించిన తీరు చూస్తే మాత్రం నందమూరికి టీడీపీ బంధం ఎక్కడో తెగినట్లుగా రాజకీయ వాసనలు అయితే వస్తున్నాయి. చూడాలి మరి ఇది ఎంత వరకూ పార్టీలో కూటమిలో ప్రభావం చూపిస్తుందో.

# ఎయిర్ పోర్టు కట్టకపోతే మంత్రిగా ఎందుకు...లాజిక్కే మరి !



అమరావతి,పదవులు అలంకారాలు మాత్రమే కాదు, బాధ్యత కూడా. సీట్లో కూర్చున్న వారికి లక్షా ముప్పాతిక తలనొప్పులు ఉంటాయి. దాంతో పాటు అనేక సవాళ్ళు స్వపక్షం నుంచి విపక్షం నుంచి కూడా ఉంటాయి. వీటికి మించి జనంలో మార్కులు కూడా తీసుకోవాల్సి ఉంటుంది. అయిదేళ్ళ పాటు అధికారం చలాయించిన తరువాత ఓట్ల కోసం జనాల ముందుకు వెళ్తే చెప్పుకోవడానికి ఒక్కటైనా ఉండాలి కదా మరి. అదే సిక్కోలు జిల్లాకు చెందిన యువ నేత కేంద్ర పౌర విమాన యాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడులో కూడా కలుగుతున్న భావన. ఆయన హ్యాట్రిక్ ఎంపీ. మంచి మాటకారి. సబ్జెక్ట్ కూడా ఉంది. సమర్ధుడైన నేతగా గుర్తింపు తెచ్చుకున్నారు. గట్టిగా నాలుగు పదులు కూడా నిండకుండానే కేంద్రంలో టాప్ పోర్ట్ ఫోలియోల్లో ఒకటైన విమాన శాఖను అందుకున్నారు.

జిల్లాకు ఎయిర్ పోర్టు :

తన సొంత జిల్లాకు ఎయిర్ పోర్టుని తీసుకుని వస్తాను అని కేంద్ర మంత్రి అంటున్నారు. కార్గో ఎయిర్ పోర్టుని జిల్లాలోని పలాసలో నిర్మించాలని ఆయన చూస్తున్నారు. ఈ మేరకు ఆయన ప్రతిపాదించారు. ఎటూ ఆయన శాఖే కాబట్టి కేంద్రం నుంచి నో అబ్జక్షన్. అలాగే చంద్రబాబు ముఖ్యమంత్రి. ఆయనే ఏపీలో 2024 కి ముందు ఉన్న ఏడు ఎయిర్ పోర్టులను 14గా చేయాలని కేంద్ర మంత్రికి సూచించారు. అందులో ఒకటి శ్రీకాకుళంలో ఏర్పాటు చేస్తామంటే చంద్రబాబు కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. అయితే అసలైన సమస్య ఇపుడు వచ్చి పడింది.

భూ సమీకరణతోనే :

పలాసలో ఎయిర్ పోర్టు కట్టాలీ అంటే భారీ ఎత్తున భూసేకరణ జరగాలి. ల్యాండ్ పూలింగ్ విధానం టీడీపీకి బాగా అచ్చి వస్తోంది. అమరావతిలో సునాయాసంగా 33 వేల ఎకరాలను తీసుకున్నారు. ఇపుడు అదే విధంగా కార్గో ఎయిర్ పోర్టు కోసం ల్యాండ్ పూలింగ్ చేయాలని చూస్తున్నారు. కానీ ప్రతిపక్షాల నుంచి నిరసన వ్యక్తం అవుతోంది. ఉద్దానం తదితర ప్రాంతాలలో భూములను ఇవ్వడానికి రైతులు కొంతమంది అంగీకరించడం లేదు. వారు కొబ్బరి తోటలతో తమకు గణనీయంగా ఆదాయం వస్తోందని అంటున్నారు. వామపక్షాలు సైతం కార్గో ఎయిర్ పోర్టు ఎందుకు దండుగ అంటున్నారు. భోగాపురం ఎయిర్ పోటు పక్కనే ఉండగా మళ్ళీ ఎందుకు అంటున్నారు. దాంతో భూ వివాదం రాజుకుంటోంది.

ఉపాధి కల్పన కోసమే :

అయితే మూలపేటలో పోర్టు నిర్మాణం అవుతోందని రానున్న రోజులలో ఎయిర్ పోర్టు కూడా ఉంటే శ్రీకాకుళం జిల్లా అభివృద్ధి సాధిస్తుందని కేంద్ర మంత్రి అంటున్నారు. అంతే కాదు జిల్లాలో పరిశ్రమలు ఏర్పాటు చేయాలంటే ఎయిర్ పోర్టు లేదని చెబుతున్న వారికి కూడా దీనిని నిర్మించి మాట్లాడే చాన్స్ లేకుండా చేద్దామని కేంద్ర మంత్రి అంటున్నారు. భూసమీకరణ ద్వారా భూములు ఇస్తే వారికి నష్టం కలుగకుండా చూస్తామని అంటున్నారు. కార్గో ఎయిర్ పోర్టు ద్వారా పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు వస్తాయని పైలెట్ ట్రైనింగ్ సెంటర్ ని కూడా ఏర్పాటు చేస్తామని చెబుతున్నారు.

ఒడిశా పోటీకి వస్తోంది :

పలాస వద్ద కార్గో ఎయిర్ పోర్టుని తాము నిర్మిస్తామని చెప్పగానే ఒడిషా నుంచి కూడా తమకు ఎయిర్ పోర్టు ఒకటి కావాలని ప్రతిపాదన వచ్చిందని కేంద్ర మంత్రి రామ్మోహన్ చెప్పారు అంతే కాదు అనేక మంత్రి ముఖ్యమంత్రులు వివిధ రాష్ట్రాల నుంచి తమకు ఎయిర్ పోర్టులు కావాలని విజ్ఞాపనలు వస్తున్నాయని ఆయన చెప్పారు. ఇలా దేశమంతా పోటీ పడుతున్న పౌర విమానయాన రంగం విషయంలో జిల్లాకు తాను మంత్రిగా ఉండి ఏమీ చేయకపోతే ఎలా అని ఆయన ప్రశ్నించారు. అందుకే తాను కచ్చితంగా ఎయిర్ పోర్టు నిర్మిస్తామని ఆయన స్పష్టం చేశారు. రైతులు భూములు ఇవ్వాలని కోరారు. మీ కొబ్బరి చెట్టూ ఎదగాలి ఎయిర్ పోర్టూ ఎదగాలని ఆయన వారితో నిర్వహించిన సమావేశంలో సరదాగా వ్యాఖ్యానించారు. ఎయిర్ పోర్టు వద్దు అంటున్న వారిని ఉపాధిని చూపించాలని రైతులు నిగ్గదీయాలని కూడా ఆయన కోరుతున్నారు. మొత్తానికి రామ్మోహన్ నాయుడు తాను మంత్రిగా జిల్లాకు ఎయిర్ పోర్టు ఇస్తానని ఖరాకండీగా చెబుతున్నారు. మరి అది ఎపుడు శ్రీకారం చుట్టుకుంటుంది అన్నది చూడాల్సి ఉంది.

# జూబ్లిహిల్స్‌లో ఏ పార్టీకి అడ్వాంటేజ్ !?



హైదరాబాద్,జూబ్లిహిల్స్ ఉపఎన్నిక తెలంగాణ రాజకీయాల్లో మలుపులకు కారణం కాబోతోంది. అందుకే ఆస్థానంలో జరిగే ఉపఎన్నికపై అందరి దృష్టి పడింది. సిట్టింగ్ స్థానాన్ని నిలబెట్టుకోవడానికి బీఆర్ఎస్, అధికార పార్టీగా గెలవాల్సిన అవశ్యకతను కాంగ్రెస్, పుంజుకుంటున్నామని నిరూపించడానికి బీజేపీకి ఈ ఉపఎన్నిక చాలా కీలకంగా మారింది. ఎవరి ప్రయత్నాలు వారు చేసుకుంటున్నారు. అయితే జూబ్లిహిల్స్‌లో పరిస్థితి ఎలా ఉందన్నది ఎవరికీ అంతుబట్టడం లేదు. పూర్తిగా నగర నియోజకవర్గం కావడం.. బస్తీల ఓటర్లు ఎక్కువగా ఉండటం, మైనార్టీలు ఫలితాలు తేల్చే స్థాయిలో ఉండటంతో సమీకరణాలే కీలకంగా మారనున్నాయని అంచనా వేస్తున్నారు.

బీఆర్ఎస్ – ఏదీ కలసి రావడం లేదు !

జూబ్లిహిల్స్ భారత రాష్ట్ర సమితి సిట్టింగ్ సీటు. మాగంటి గోపీనాథ్ మూడోసారి ఆ నియోజకవర్గం నుంచి గెలిచారు. ఓ సారి టీడీపీ నుంచి రెండు సార్లు బీఆర్ఎస్ నుంచి గెలిచారు. మొదటి సారి టీడీపీ గెల్చినప్పుడు రెండో స్థానంలో మజ్లిస్ ఉంది. కాంగ్రెస్ మూడో స్థానంలో బీఆర్ఎస్ నాలుగో స్థానంలో ఉన్నాయి. వాస్తంగా బీఆర్ఎస్ ఓటు బ్యాంక్ అక్కడ అంతే. కొత్త ఏర్పడిన ఏర్పడిన కొత్తలో ఉన్న సెంటిమెంట్ ప్రకారం బీఆర్ఎస్ ఓటు బ్యాంక్ 18వేలు. ఆ తర్వాత రెండు ఎన్నికల్లో మజ్లిస్ పార్టీ పోటీ చేయలేదు. బీఆర్ఎస్‌కు పరోక్షంగా మద్దతు ఇచ్చింది. మాగంటి గోపీనాథ్ రెండు సార్లు విజయంలో మజ్లిస్ కీలకం. ఇప్పుడు మజ్లిస్ పార్టీ బీఆర్ఎస్ పార్టీకి సపోర్టుగా లేదు. పలువురు నేతలు మాగంటి గోపీనాథ్ జీవించి ఉన్నప్పుడే ఆయనతో విబేధించి పార్టీ నుంచి వెళ్లిపోయారు. కాంగ్రెస్ నుంచి వచ్చిన విష్ణువర్ధన్ రెడ్డి వల్ల ఎంత ఉపయోగమో బీఆర్ఎస్‌కే అర్థం కావడం లేదు. కనీసం సానుభూతి అయినా గట్టెక్కిస్తుందన్న ఆశతో.. మాగంటి సునీతకే టిక్కెట్ ఖరారు చేశారు.

కాంగ్రెస్ పార్టీకి మజ్లిసే బలం

కాంగ్రెస్ పార్టీ అధికార హోదాలో ఉంది. గత ఎన్నికల్లో అజహర్‌కు చివరి క్షణంలో టిక్కెట్ ఖరారు చేశారు. అయినప్పటికీ ఆయన రెండో స్థానంలో నిలిచారు. పదహారు వేల ఓట్ల తేడాతో ఓడిపోయారు. మజ్లిస్ అభ్యర్థి బరిలో లేరు. పరోక్షంగా బీఆర్ఎస్ పార్టీకి సహకరించారు. అజహర్ కోసం కొంత క్రాస్ ఓటింగ్ జరిగినా అది గెలుపు ఇవ్వలేదు. ఈ సారి కాంగ్రెస్ పార్టీకి అడ్వాంటేజ్ గా మజ్లిస్ పార్టీనే నిలుస్తోంది. ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీకి సహకరించడం మజ్లిస్ నైజం. ఓట్లు చీల్చడానికి అయినా.. ఓట్లు వేయించడానికి అయినా.. మజ్లిస్ బాగా ఉపయోగపడుతుంది. స్థానికంగా బస్తీల్లో పట్టు ఉన్న నవీన్ యాదవ్ ను అభ్యర్థిగా నిలబెట్టాలని అనుకుంటున్నారు. అందుకే.. కాంగ్రెస్ పార్టీ ఎక్కువ నమ్మకంతో ఉంది. పార్టీలో అంతర్గత సమస్యలు పెద్దగా ప్రభావం చూపవని అనుకుంటున్నారు.

బీజేపీ పెద్దగా ప్రయత్నించడం లేదు !

గతంలో ఉపఎన్నికలు అంటే.. బీజేపీ హడావుడి ఎక్కువగా ఉండేది. దుబ్బాక అయినా.. హుజూబారాబాద్ అయినా.. మునుగోడు అయినా ఉపఎన్నికల్లో బీజేపీ వర్సెస్ బీఆర్ఎస్ అన్నట్లుగా సాగేది. కానీ ఇప్పుడు బీజేపీ ఉపఎన్నికనపై పెద్దగా దృష్టి పెట్టలేదు. సాధారణంగా ఉపఎన్నిక వస్తే చాలా పెద్ద కసరత్తు ఆ పార్టీ చేస్తుంది. ఈ సారి మాత్రం చేయడం లేదు. అభ్యర్థిని నిలబెడుతుంది. ఆ పార్టీకి స్థిరమైన ఓటు బ్యాంక్ ఉంది. అది ఏ పార్టీకి మారదు. అందుకే బలంగా ఓట్లను చీలున్తుంది కానీ.. గెలుపు రేసులో ఉండకపోవచ్చని భావిస్తున్నారు.మొత్తంగా జూబ్లిహిల్స్ లో పోటీ .. కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్యనే సాగనుంది. మజ్లిస్ మద్దతు, అధికార పార్టీ అడ్వాంటేజ్ , రేవంత్ వ్యూహాలు కాంగ్రెస్ పార్టీకి స్వల్ప అడ్వాంటేజ్ చూపిస్తున్నాయని అనుకోవచ్చు.

# దానం రాజీనామా ఉత్తదే !



హైదరాబాద్,దానం నాగేందర్ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తున్నారని సోషల్ మీడియాలో చెలరేగిన పుకార్లకు ఆయన చెక్ పెట్టారు. తనకు అలాంటి ఆలోచన లేదని.. తన వ్యతిరేకులే అలాంటి ప్రచారం చేస్తున్నారని చెప్పుకొచ్చారు. దానం నాగేందర్ .. ఖైతరాబాద్ ఎమ్మెల్యేగా రాజీనామా చేసి.. జూబ్లిహిల్స్ ఎమ్మెల్యేగా పోటీ చేస్తారని ప్రచారం జరుగుతోంది. ఈ మేరకు ఆయన హైకమాండ్ ను కూడా సంప్రదించారని చెప్పుకున్నారు. కానీ ఈ ప్రతిపాదనకు.. కాంగ్రెస్ హైకమాండ్ అంగీకరించలేదు. కానీ హఠాత్తుగా ఆయన రాజీనామా చేస్తారన్న ప్రచారం ఊపందుకుంది.పార్టీ ఫిరాయించిన పది మంది ఎమ్మెల్యేల కంటే .. దానం నాగేందర్ పరిస్థితి భిన్నం. మిగతా వారంతా తాము పార్టీ మారలేదని చెప్పుకున్నారు. ఆ మేరకు విచారణకు కూడా హాజరయ్యారు. కానీ దానం నాగేందర్ కు అలా చెప్పుకునే అవకాశం లేదు. ఎందుకంటే ఆయన కాంగ్రెస్ తరపున సికింద్రా బాద్ నుంచి ఎంపీగా పోటీ చేశారు కూడా. గెలిచి ఉంటే రాజీనామా చేసి ఉండేవారు కానీ ఓడిపోయారు కాబట్టి ఇప్పుడు ఏ నిర్ణయమూ తీసుకోలేకపోతున్నారు.మిగతా అందరి ఎమ్మెల్యేలపై దాఖలైన అనర్హతా పిటిషన్లను స్పీకర్ తిరస్కరించవచ్చు కానీ.. దానం నాగేందర్ విషయంలో మాత్రం స్పీకర్ అలా చేయడం కష్టం. అలాగని దానంపై అనర్హతా వేటు వేయలేరు. అలాంటి పరిస్థితి వస్తే రాజీనామా చేయిస్తారు. అందుకే రాజీనామా పుకార్లు వస్తున్నాయి. జూబ్లిహిల్స్ టిక్కెట్ ఇస్తే ఆయన రాజీనామా చేయడానికి రెడీనే. కానీ హైకమాండ్ మాత్రం ఆ చాయిస్ ఇవ్వడం లేదు.

# బాబును నివేదికలు భయపెడుతున్నాయా?



అమరావతి,పాలనపై వివిధ సర్వే సంస్థల నివేదికలు భయపెడుతున్నాయా? అంటే ఔనని టీడీపీ వర్గాలు అంటున్నాయి. క్షేత్రస్థాయిలో సుమారు 90-100 నియోజకవర్గాల్లో కూటమి ప్రజాప్రతినిధుల పనితీరుపై వ్యతిరేకత ఉన్నట్టు చంద్రబాబుకు నివేదికలు అందినట్టు విశ్వసనీయ వర్గాల సమాచారం. అందుకే సీఎం చంద్రబాబు సభల్లో పదేపదే మళ్లీ జగన్‌ను ఆదరించొద్దని కోరడాన్ని టీడీపీ నాయకులు గుర్తు చేస్తున్నారు.కూటమి ఎమ్మెల్యేల తీరుపై సీఎం చంద్రబాబు తీవ్ర అసహనంతో ఉన్నారు. పలుమార్లు తానే పిలిపించుకుని మాట్లాడినా ఎలాంటి మార్పు రావడం లేదనే ఆవేదన, ఆగ్రహంతో చంద్రబాబు ఉన్నట్టు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో కేబినెట్ భేటీలో కూటమి నేతల్ని కట్టడి చేయాలనే బాధ్యతల్ని ఎందుకు మరిచిపోయారని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రులపై చంద్రబాబు కస్సుబుస్సులాడడాన్ని గమనంలో పెట్టుకోవాలి.చంద్రబాబును అధికారం వుంటుందా? వుండదా? అనే బెంగ వెంటాడుతోన్నట్టు కనిపిస్తోంది. ముఖ్యంగా ప్రజల్లో బాగా వ్యతిరేకత వున్న టీడీపీ ఎమ్మెల్యేలను పిలిపించుకుని తీవ్ర ఆగ్రహం ప్రదర్శిస్తున్నారని సమాచారం. ఇదంతా నాలుగు గోడల మధ్య సాగుతున్న వ్యవహారం. ప్రజలంతా చూసేలా గత పాలకులు అంటూ వైఎస్ జగన్, ఆయన పార్టీ నేతలపై చంద్రబాబు తీవ్రస్థాయిలో విరుచుకుపడుతున్నారు.ఇంకా ఎన్నికలకు మూడున్నరేళ్లకు పైగా సమయం ఉంది. అయితే ఇప్పటి నుంచే ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న రీతిలో వైఎస్ జగన్‌కు అధికారం ఇవ్వొద్దని బాబు వేడుకోవడం చూస్తే ఆశ్చర్యం కలుగుతోంది.

అసలు ఆయనకు అధికార మార్పిడి జరుగుతుందనే అనుమానం ఎందుకొస్తోందని ఆరా తీయగా సర్వే నివేదికలు డేంజర్ బెల్స్ మోగిస్తున్నట్టుగా చెబుతున్నారు. అయితే ఇప్పటికిప్పుడు ప్రభుత్వానికి ఏదో జరుగుతుందన్న భయం లేకపోయినప్పటికీ, భవిష్యత్ మాత్రమే ఆయన్ను ఆందోళనకు గురి చేస్తోందని సన్నిహితులు అంటున్నారు.వైసీపీ పాలనపై బహిరంగంగా ఎన్నెన్నో విమర్శలు చేస్తున్నా, కూటమి ప్రజాప్రతినిధులు వాళ్ల కంటే బిన్నంగా ప్రవర్తించడం లేదన్న హెచ్చరిక చంద్రబాబును ఆందోళనకు గురి చేస్తోంది. చంద్రబాబు ఎంతో జాగ్రత్త మనిషి. అయినప్పటికీ, కూటమి ప్రజాప్రతినిధులు చేయిదాటి పోతున్నారన్న అభిప్రాయం ఆయనలో వుంది. అలాగని కట్టడి చేయాలని అనుకుంటున్నా, అది సాధ్యం కావడం లేదు. ఎన్నికల్లో పెట్టిన ఖర్చు, అలాగే రానున్న ఎన్నికలకు మళ్లీ సంపాదించుకోవాలన్న ఆలోచనలో ఎమ్మెల్యేలు, మంత్రులున్నారు.సంపాదన తప్ప, మరే మాట ప్రజాప్రతినిధుల చెవికెక్కడం లేదు. మంచీచెడుల గురించి ఆలోచించే తీరిక అసలు వుండడం లేదు. అందుకే కూటమి ప్రజాప్రతినిధులపై వ్యతిరేకత. అయితే దీనంతటిని వైసీపీ ఏ రకంగా రాజకీయంగా సొమ్ము చేసుకుంటుందనే సామర్థ్యంపై అధికారం ఆధారపడి వుంటుంది. అసలే సెల్ఫ్‌గోల్స్ వేసుకోవడంలో వైసీపీకి మరేదీ సాటి రాదు. రానున్న రోజుల్లో కాలం ఎన్నెన్ని మార్పులు తీసుకొస్తుందో చూడాలి.

# నిరవ్ మోదీ,మాల్యాను తీసుకొస్తారు సరే శిక్షించగలరా?



న్యూఢిల్లీ,నిరవ్ మోదీని వచ్చే నెలలో భారత్ కు అప్పగించే అవకాశం ఉంది. అయితే ఆయనను తీసుకొచ్చి ఏం చేయగలరు అన్నది ఇప్పుడు ఎక్కువ మందికి వస్తున్న ప్రశ్న. విజయ్ మాల్యాను ఇంత వరకూ తీసుకురాలేకపోయారు. అలాగని వారిని అలా వదిలేయడం సమస్య పరిష్కారం కాదు. తీసుకు వచ్చి చట్టబద్ధంగా వారిని శిక్షించగలరా అన్నది ఎక్కువ మందికి వస్తున్న సందేహం. వారు పారిపోకుండా ఉంటే.. ఈ పాటికి ఇండియాలో ఎప్పట్లాగే దర్జాగా బతికేవారు. వారి కేసులో కోర్టుల్లో కోల్డ్ స్టోరేజీలో ఉండేవి.

ఇండియాలోనే ఉన్నట్లయితే దివాలా పిటిషన్లు వేసుకునేవారు అంతే !

విజయ్ మాల్యా, నిరవ్ మోదీ బ్యాంకుల వద్ద అప్పులు తీసుకుని చెల్లించలేక పారిపోయారు. లలిత్ మోదీతో మరో కేసు. ఆయన అప్పులు తీసుకోలేదు. ఏదో ఆర్థిక పరమైన అవకతవలకు పాల్పడ్డారని ఆరోపణలు. వీరంతా ఇండియా రాకుండా విదేశాల్లోనే టైంపాస్ చేస్తున్నారు. ఇండియాలో మాత్రం పారిపోయిన వారిగా ముద్రపడిపోయింది. వారు వెళ్లిపోయే ముందు కాస్త తెలివిగా ఆలోచించినట్లయితే%ా% తాము పారిపోకుండా ఇండియాలోనే ఉండి ఉంటే.. చాలా కొద్ది రోజులు జైల్లో ఉండే వాళ్లమని.. బెయిల్ తెచ్చుకుని మళ్లీ పెద్ద మనుషుల్లా చెలామణి అయ్యే వాళ్లమని వారికి క్లారిటీ ఉండేది.

సుబ్బరామిరెడ్డికి ఉన్నంత తెలివి కూడా లేదా ?

కాంగ్రెస్ మాజీ ఎంపీ సుబ్బరామిరెడ్డి .. బ్యాంకులకు నిరవ్ మోదీ, మాల్యా తరహాలోనే డబ్బులు ఎగ్గొట్టారు. ప్రాజెక్టుల పేరుతో పెద్ద ఎత్తున అప్పులు తీసుకుని రూపాయి కూడా కట్టలేదు. చివరికి ఆరు వేల కోట్ల వరకూ తక్కువ చేసి వన్ టైం సెటిల్మెంట్ చేసుకున్నారు. ఇప్పుడు కేసులు లేవు.. అరెస్టులు లేవు. బ్యాంకుల సొమ్ములు సొంతం అయిపోయాయి. అలాంటి ప్లాన్లు కూడా మాల్యాలు, నిరవ్ మోదీలు అమలు చేసుకోలేకపోయారు.

వారిని తీసుకొచ్చినా కేసులు తేలవు !

నిరవ్ మోదీని వచ్చే నెలలో తీసుకు వస్తారు. ఇప్పటికే జైల్లో సౌకర్యాలపై బ్రిటన్ అధికారులు కూడా వచ్చి చూసి పోయారు. విజయ్ మాల్యాను కూడా అప్పగించవచ్చు. అయితే వారిని తీసుకు వచ్చి.. వారి పేర్లపై మిగిలిన ఆస్తులు ఏమైనా ఉంటే జప్తు చేస్తారు. మహా అయితే రెండు, మూడు నెలల పాటు సౌకర్యవంతమైన జైలు తర్వాత బెయిల్ పై వస్తారు. ఎప్పట్లాగే లగ్జరీ లైఫ్ అనుభవిస్తారు. కొంత కాలం తర్వాత వారి కేసుల్ని పట్టించుకునేవారు ఉండరు. భారత వ్యవస్థల్లో ఉన్న లోపాలను ఉపయోగించుకుని వారు హాయిగా ఉంటారు. ఇది మాత్రం మారదు. ప్రజలు కూడా అదంతే అనుకుని పన్నులు కట్టుకుని తమ బతుకు పోరాటం తాము చేసుకుంటారు.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com